MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 316 | పేజీలు : 8 | గురువారం 5 నవంబర్ 2026 | వెల : 6-00



సహాయ చర్యలు వేగవంతం

- మురసు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు ఏరియల్ వ్యూ
- గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో తుఫాన్ నష్టాన్ని పరిశీలించిన సీఎం
- నీట మునిగిన పంటలు, జలదిగ్బంధంలో చిక్కుకున్న గ్రామాల పరిస్థితులపై ఆరా
- ఏరియల్ వ్యూ అనంతరం ఆర్టీజీఎస్‌లో అధికారులతో సమీక్ష
- ముంపు ప్రాంతాలను త్వరితగతిన క్లియర్ చేయాలని అధికారులకు ఆదేశాలు

అమరావతి, మహానగర్

మురసు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏరియల్ వ్యూ నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను ఆయన ఏరియల్ వ్యూ ద్వారా సందర్శించారు. చిలకలూరిపేట, ఒంగోలు, కొత్తపట్నం, చినగంజాం, చీరాల, బాపట్ల ప్రాంతాల్లో పర్యటించి భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా ఏర్పడిన నష్టాన్ని గమనించారు. ముఖ్యంగా వర్షపు నీటిలో మునిగిపోయిన వ్యవసాయ పంటలు, నీటితో చుట్టుముట్టిన గ్రామాలు, వరద ప్రవాహాల కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడిన రహదారుల పరిస్థితిని పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో



ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ముంపు ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఏరియల్ వ్యూ అనంతరం అమరావతిలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ (ఆర్టీజీఎస్) నుంచి అధికారులతో సమీక్ష నిర్వహించారు. తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు వివిధ వాగులు, కాలువల్లో వరద ప్రవాహాలు - మిగతా2లో



ఈ నెల 23న మేయర్లు, చైర్‌పర్సన్ల ప్రమాణ స్వీకారం!

- డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికకూ అదే రోజు ముహూర్తం
- 13 కార్పొరేషన్లు.. 87 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రక్రియ
- ప్రత్యక్ష ఎన్నికలతో మారిన ప్రమాణ స్వీకార విధానం
- డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికపై స్పష్టత రావాల్సి ఉంది

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మరో కీలక దశకు చేరుకుంది. రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీల్లో ఎన్నికైన మేయర్లు, చైర్‌పర్సన్లు ఈ నెల 23న బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ముహూర్తం ఖరారు చేసింది. అదే రోజు డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికకు కూడా షెడ్యూల్ ప్రకటించింది. దీంతో పట్టణాల్లో కొత్త పాలకవర్గాల ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి. - మిగతా2లో

చంద్రబాబుకు ఫోన్ చేసిన ప్రధాని మోదీ

అర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంపై ఆరా
రాష్ట్రంలో జరిగిన నష్టాన్ని వివరించిన సీఎం

అమరావతి, మహానగర్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఉదయం ఫోన్ చేసి, వారం రోజుల వ్యవధిలో రాష్ట్రాన్ని తాకిన అర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంపై ఆరా తీశారు. తుఫాన్ల కారణంగా ప్రభావిత ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులు, జరిగిన నష్టాన్ని సీఎం చంద్రబాబు ప్రధానికి వివరించారు. భారీ - మిగతా2లో





కొరియాలో మళ్లీ ఖాకీ వార్!

- రేషన్ బియ్యం వాహనాన్ని అడ్డుకున్న ఒడిశా పోలీసులు
- ఏపీ ఎన్నికల్లో ఓటు వేయొద్దంటూ ఒత్తిళ్లు.. గ్రామస్థుల ఆగ్రహం

5



మోదీని ఐదు నిమిషాల్లోనే ఎండగడతా!

- ట్రంప్ నియంత్రణలో ప్రధాని.. దేశద్రోహి అంటూ రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు
- మోదీతో ముఖాముఖి చర్చకు సవాల్.. ఏడాదిలోపే ఎన్డీయే సర్కార్ కూలుతుందని జోస్యం
- అమిత్ షాపైనా విమర్శలు.. అదానీ పోర్టులో పట్టుబడిన డ్రగ్స్ ఏమయ్యాయని ప్రశ్న

5



అగ్నివీర్‌లకు కేంద్రం గుడ్‌న్యూస్

- మరో రెండేళ్లు సైన్యంలో సేవలకు అవకాశం!
- 75 శాతం మందికి రెండో విడత సర్వీస్..
- ఆ తర్వాత రెగ్యులర్ ఫోర్స్‌లో చేరే ఛాన్స్
- నాలుగేళ్ల సేవా కాలం ఆరేళ్లకు పెంపు.. అధిక వేతనంతో అదనపు సర్వీస్
- కేంద్ర కేబినెట్‌లో కీలక నిర్ణయాలు.. 850 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు ఆమోదం

అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా జాతీయ పరీక్షా విధానం

- అన్ని రాష్ట్రాల ఏకాభిప్రాయంతో అత్యుత్తమ విధాన రూపకల్పన
- హై పవర్డ్ టాస్క్ ఫోర్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా చూడాలన్న మంత్రి లోకేష్
- సీఎంతో సమావేశమైన ఎగ్జామినేషన్ రిఫార్మ్ హై పవర్డ్ టాస్క్ ఫోర్స్ చైర్మన్ నందన్ నీలేకని



అమరావతి, మహానగర్

విభిన్న రాష్ట్రాలు, భాషలు కలిగిన భారతదేశంలో అందరినీ కలుపుకొని వెళ్లేలా జాతీయ పరీక్షా సంస్కరణలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, ఏకాభిప్రాయంతో పారదర్శకమైన, విశ్వసనీయమైన జాతీయ పరీక్షా విధానాన్ని రూపొందించాలని అన్నారు. దేశంలోని ఏ ప్రాంతానికి చెందిన విద్యార్థికైనా, ఏ భాష మాట్లాడే విద్యార్థికైనా సమాన అవకాశాలు, న్యాయం జరిగేలా సంస్కరణలు ఉండాలని స్పష్టం చేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఎగ్జామినేషన్ రిఫార్మ్ హై పవర్డ్ టాస్క్ ఫోర్స్ చైర్మన్ నందన్ నీలేకని నేతృత్వంలోని టాస్క్ ఫోర్స్ సభ్యులు ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. సచివాలయానికి వచ్చిన నందన్ నీలేకనికి మంత్రి నారా లోకేష్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన భేటీలో జాతీయ పరీక్షా విధానంపై టాస్క్ ఫోర్స్‌కు సీఎం చంద్రబాబు సూచనలు చేశారు. నేటి తరం విద్యార్థులు, యువత ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా పరీక్షల విధానం ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. కేవలం - మిగతా2లో

రష్యా సైన్యంలో ఉద్యోగాల పేరుతో మోసాలు.. యువత అప్రమత్తంగా ఉండాలి

- అధిక వేతనాలు, విదేశీ ఉద్యోగాల పేరుతో యువతకు వల
- ప్రైవేట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు, అక్రమ ఏజెంట్లపై జాగ్రత్త
- ఉద్యోగాల పేరుతో రష్యాకు పంపించి సైన్యంలో చేరేలా ఒత్తిడి
- అనుమానాస్పద ఏజెంట్ల వివరాలను పోలీసులకు తెలియజేయాలని ప్రభుత్వ సూచన

విశాఖపట్నం, మహానగర్

రష్యా సైన్యంలో ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేస్తున్న ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. రష్యా సైన్యంలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ భారతీయ యువతను మోసం చేసి, ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టివేస్తున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన యువతను కొన్ని ప్రైవేట్ ట్రైనింగ్ - మిగతా2లో

సహాయ చర్యలు వేగవంతం

-మొదటిపేజీ తరువాయి

పెరిగాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎర్రకాలువ, గోనెల వాగు తదితర ప్రాంతాలకు వరద నీరు చేరుతోందని తెలిపారు. తెలంగాణలో కురుస్తున్న వర్షాల కారణంగా ఆయా వాగులు, కాలువలకు మరింత వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో దిగువ ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సీఎం సూచించారు. కారంచేడు నుంచి కొత్తపట్నం, చీరాల, చిలకలూరిపేట, పర్చూరు వరకు ఉన్న ముంపు ప్రాంతాల్లో నీటిని త్వరితగతిన తొలగించేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముంపు కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. రహదారులపై వరద నీరు నిలిచిపోవడం వల్ల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు స్పష్టం చేశారు. అవసరమైన చోట్ల రహదారుల పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా, ఏలూరు జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. బుట్టాయగూడెం, వేలేరుపాడు, పోలవరం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం తదితర మండలాల్లో వర్షాల తీవ్రత అధికంగా ఉందని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో చిన్న నీటిపారుదల



చెరువులు పూర్తిస్థాయిలో నిండిపోయి నీరు పొంగిపొర్లుతోందని ఏలూరు జిల్లా కలెక్టర్ వివరించారు. ఆయా ప్రాంతాల్లో వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

పోలింగ్ సామగ్రి పంపిణీ పూర్తి.. ప్రశాంత వాతావరణంలో పోలింగ్‌కు ఏర్పాట్లు : జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు, బుడమేరు ప్రవాహ పరిస్థితులపై జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన

పోలింగ్ సిబ్బందికి, ఓటర్లకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాం.. జి.కొండూరు మండలంలో 16 సెగ్మెంట్లు, 60 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు

ఎన్నికల సిబ్బంది రవాణాకు 5 ప్రత్యేక రూట్లు, ప్రతి రూట్‌కు రెండు బస్సులు.. పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియ సజావుగా పూర్తి

బుడమేరులో తగ్గిన నీటి ప్రవాహం - డ్రోన్ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ.. ప్రస్తుతానికి ఎలాంటి వరద ముప్పు లేదు - ప్రజలు ఆందోళన చెందవద్దు





విజయవాడ/జి.కొండూరు/గంపలగూడెం, మహానగర్

జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని, పోలింగ్ సిబ్బందికి, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం విజయవాడ, జి.కొండూరు, గంపలగూడెం మండలాల్లో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించి, ఒకవైపు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఏర్పాట్లను, మరోవైపు ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. పర్యటనలో భాగంగా జి.కొండూరు, గంపలగూడెం మండలాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించి, పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలించారు. పంపిణీ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా, సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జి.కొండూరు మండలంలో మొత్తం 16 సెగ్మెంట్లు, 60 పోలింగ్ స్టేషన్లను ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఎన్నికల సామగ్రి తరలింపు, పోలింగ్ సిబ్బంది రవాణా కోసం ఐదు ప్రత్యేక రూట్లను ఏర్పాటు చేశామని, ప్రతి రూట్‌కు రెండు బస్సుల చొప్పున కేటాయించినట్లు తెలిపారు. రవాణా ఏర్పాట్లలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గురువారం పోలింగ్ నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను అత్యంత జాగ్రత్తగా, అప్రమత్తంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల నియమావళిని పూర్తిస్థాయిలో పాటిస్తూ, పోలింగ్ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, ఇతర అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల అధికారులకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో విజయవాడ దేవినగర్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయక చర్యలు కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పునరావాస కేంద్రాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు ఉండేలా చూడాలని ఆదేశించారు. అనంతరం జి.కొండూరు మండల పరిధిలోని వెలగపూడి హెడ్ రెగ్యులేటర్, హెచ్. ముత్యాలంపాడు బ్రిడ్జి, గంపలగూడెం మండల పరిధిలోని కట్టలేరు బ్రిడ్జి ప్రాంతాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. బుడమేరు రెగ్యులేటర్ వద్ద నీటి ప్రవాహ పరిస్థితులను అధికారులు డ్రోన్ కెమెరాల సహాయంతో క్షుణ్ణంగా పరిశీలించారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటి ప్రవాహం (ఇన్‌ఫ్లో) గత రోజుతో పోలిస్తే గణనీయంగా తగ్గిందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం నీటి ప్రవాహ పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని, ఎలాంటి వరద ముప్పు లేదని స్పష్టం చేశారు. బుడమేరు పరీవాహక ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, నీటి ప్రవాహంలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులను ...

తుఫాన్ల అనంతర ఆరోగ్య ముప్పులపై స్టార్ హెల్త్ హెచ్చరిక

గుంటూరు, మహానగర్:

వరుస తుఫాన్ల ప్రభావం నుంచి కోలుకుంటున్న ఆంధ్రప్రదేశ్ కోస్తా ప్రాంతాల్లో ప్రజలు ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ సూచించింది. భారీ వర్షాలు, వరదలు, నీటి నిల్వల కారణంగా తుఫాన్ల అనంతరం అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించింది. ముఖ్యంగా కలుషిత నీటి ద్వారా టైఫాయిడ్, కలరా, హెపటైటిస్-ఎ, డయేరియా వంటి వ్యాధులు, నిల్వ నీటి కారణంగా డెంగ్యూ, మలేరియా వ్యాప్తి చెందవచ్చని తెలిపింది. తాగునీటిని కాచి చల్లార్చి వినియోగించాలని, నీటి నిల్వ పాత్రలను మూతలతో ఉంచాలని, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించింది. జ్వరం, వాంతులు, విరేచనాలు, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సలహా తీసుకోవాలని కోరింది. రవాణా, వైద్య సేవలకు అంతరాయాలు ఎదురయ్యే పరిస్థితుల్లో ఇంటి నుంచే వైద్యులను సంప్రదించేలా టెలీ కన్సల్టేషన్ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని పేర్కొంది. ఇందుకోసం 7200 222 333 నంబరును సంప్రదించాలని తెలిపింది. పాలసీదారులకు నిబంధనల మేరకు క్యాష్‌లెస్ హోమ్ హెల్త్‌కేర్ సదుపాయం కూడా అందుబాటులో ఉందని వెల్లడించింది.

ఏఐ రంగంలోకి వీ.. పీడబ్ల్యూసీతో భాగస్వామ్యం

vi intelligence
designed to think ahead

విజయవాడ, మహానగర్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో మరింత విస్తరించే లక్ష్యంతో ప్రముఖ టెలికాం సంస్థ వీ, 'వీ ఇంటెలిజెన్స్' పేరుతో ప్రత్యేక ఏఐ వేదికను ప్రారంభించింది. సంస్థ కార్యకలాపాలను మెరుగుపరచడంతో పాటు వివిధ రంగాల్లోని వ్యాపార సంస్థలు ఏఐ సాంకేతికతను వినియోగించుకునేందుకు ఈ వేదిక దోహదపడనుంది. ఇందులో భాగంగా పీడబ్ల్యూసీ ఇండియా భాగస్వామ్యంతో వీ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఎంటర్‌ప్రైజ్ ఏఐ పరిష్కారాల అభివృద్ధి, పరిశోధన, విస్తరణకు ఇది కేంద్రంగా పనిచేయనుంది. ఏజెంటిక్, అసిస్టివ్, సావరిన్ అండ్ రెస్పాన్సిబుల్ ఏఐ అనే మూడు ప్రధాన వ్యూహాల ఆధారంగా ల్యాబ్ కార్యకలాపాలు సాగనున్నాయి. వీకి చెందిన గ్రీసీ రెస్పాన్సిబుల్ ఏఐ ఫ్రేమ్‌వర్క్ ద్వారా డేటా భద్రత, నైతిక వినియోగానికి ప్రాధాన్యమివ్వనున్నారు. ఏఐ నైపుణ్యాభివృద్ధి, హ్యాకథాన్‌లు, వినూత్న ప్రాజెక్టుల ద్వారా సంస్థలకు ఆధునిక సాంకేతిక పరిష్కారాలు అందించనున్నారు.

అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా జాతీయ పరీక్షా విధానం

-మొదటిపేజీ తరువాయి

పరీక్షలు, మార్కులకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆలోచనా సామర్థ్యం పెంపొందించేలా విద్యా విధానాన్ని తీర్చిదిద్దాలని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో పాల్గొన్న లోకేష్ ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న విధానాలు, సాంకేతికత వినియోగాన్ని వివరించారు. అలాగే దేశవ్యాప్తంగా పరీక్షల విధానంలో తీసుకురావాల్సిన సంస్కరణలపై తన ఆలోచనలను పంచుకున్నారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గేలా పరీక్షల విధానాన్ని రూపొందించాలని లోకేష్ సూచించారు. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వెళ్లి చదువుకోవాలన్నా, ఉద్యోగం చేయాలన్నా భాష, విద్యా విధానం, ధ్రువీకరణల పరంగా ఇబ్బందులు తలెత్తకుండా జాతీయ స్థాయిలో సమన్వయం ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో డేటా లేక్ ద్వారా వివిధ రంగాలకు సంబంధించిన సమాచారాన్ని సమీకరించి, నిర్ణయాలు తీసుకునే వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. పరీక్షల నిర్వహణలో పేపర్ లీకేజీలను అరికట్టడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం, సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలను పటిష్టం చేయడం, డిజిటల్ ఫోరెన్సిక్స్ విభాగాలను బలోపేతం చేయడం వంటి అంశాలపై తాము ప్రత్యేక దృష్టి సారించినట్టు టాస్క్ ఫోర్స్ చైర్మన్ నందన్ నీలేకని తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నామని, ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలు, ఎదురవుతున్న సమస్యలు, సంస్కరణలపై అభిప్రాయాలను సేకరిస్తున్నట్టు చెప్పారు. ఏపీ అమలు చేస్తున్న విధానాలపై ఆసక్తి వ్యక్తం చేశారు.

చంద్రబాబుకు ఫోన్ చేసిన ప్రధాని మోదీ

-మొదటిపేజీ తరువాయి

వర్షాలు, ఈదురు గాలుల కారణంగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. రహదారులు, విద్యుత్ సరఫరా సహా వివిధ రంగాలకు భారీ నష్టం జరిగిందని, రాష్ట్రాన్ని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన సహాయం అందించాలని ప్రధాని మోదీని కోరారు. తుఫాన్ల సమయంలో సహాయక చర్యలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా చేపట్టిందని ప్రధాని మోదీ ప్రశంసించారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ తుఫాన్ల వల్ల తలెత్తిన ఇబ్బందులను సమర్థవంతంగా అధిగమించారని చంద్రబాబును అభినందించారు.

రష్యా సైన్యంలో ఉద్యోగాల పేరుతో మోసాలు.. యువత అప్రమత్తంగా ఉండాలి


-మొదటిపేజీ తరువాయి

విశాఖపట్నం, మహానగర్

రష్యా సైన్యంలో ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేస్తున్న ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. రష్యా సైన్యంలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ భారతీయ యువతను మోసం చేసి, ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టివేస్తున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన యువతను కొన్ని ప్రైవేట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు, అక్రమ ఏజెంట్లు లక్ష్యంగా చేసుకుంటున్నట్లు ప్రభుత్వానికి సమాచారం అందింది. ఇతర ఉద్యోగాలు, అధిక వేతనాలు, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తామంటూ నమ్మించి యువతను విదేశాలకు పంపిస్తున్నట్లు వెల్లడైంది. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి రష్యాకు పంపిన అనంతరం వారిపై ఒత్తిడి తెచ్చి సైన్యంలో చేరేలా చేస్తున్నట్లు, అధిక వేతనాల ఆశ చూపుతున్నట్లు లేదా తప్పుడు కేసుల్లో ఇరికించి బలవంతంగా సైనిక కార్యకలాపాల్లో పాల్గొనేలా చేస్తున్నట్లు పలు ఆందోళనకర అంశాలు వెలుగులోకి వస్తున్నాయని ప్రభుత్వం తెలిపింది. ఈ పరిణామాలు యువత ప్రాణాలకు ముప్పుగా మారడమే కాకుండా, వారి కుటుంబాలను తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తున్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని విద్యార్థులు, నిరుద్యోగ యువత, విదేశీ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న వారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విదేశీ ఉద్యోగాల పేరుతో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలు, అధిక వేతనాల హామీలు, సులభమైన నియామక ప్రక్రియలు, తక్కువ సమయంలో విదేశాలకు పంపిస్తామనే వాగ్దానాలను నమ్మవద్దని హెచ్చరించింది. గుర్తింపు, అనుమతులు లేని ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు, అనధికారిక ఏజెంట్ల ద్వారా విదేశీ ఉద్యోగాలకు వెళ్లడం సురక్షితం కాదని స్పష్టం చేసింది. విదేశాలకు వెళ్లే ముందు ఉద్యోగ ఒప్పందాలు, వీసా వివరాలు, ఉద్యోగ స్వరూపం, నియామక సంస్థల చట్టబద్ధత, విశ్వసనీయతను సంబంధిత అధికారిక సంస్థల ద్వారా తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని సూచించింది. ముఖ్యంగా ఉద్యోగాల పేరుతో రష్యా లేదా ఇతర దేశాలకు పంపించి సైనిక శిక్షణ లేదా సైన్యంలో చేరేలా ఒత్తిడి చేసే మోసపూరిత ప్రయత్నాల పట్ల ప్రత్యేక అప్రమత్తత అవసరమని పేర్కొంది. ఇటువంటి అనుమానాస్పద ఆఫర్లు, ఏజెంట్లు, సంస్థల వివరాలను సంబంధిత ప్రభుత్వ అధికారులకు, పోలీసు శాఖకు తెలియజేయాలని ప్రభుత్వం సూచించింది. విదేశీ ఉద్యోగాల కోసం తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, పూర్తి స్థాయిలో విచారణ, ధ్రువీకరణ చేసుకున్న తర్వాతే ముందడుగు వేయాలని యువతకు విజ్ఞప్తి చేసింది.

ఈ నెల 23న మేయర్లు, ఛైర్‌పర్సన్ల ప్రమాణ స్వీకారం!

-మొదటిపేజీ తరువాయి



రాష్ట్రవ్యాప్తంగా 13 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలతో కలిపి మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికలు నిర్వహించారు. నవంబర్ 1న ప్రధాన పోలింగ్ జరగగా, నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఎన్నికల ఫలితాలతో మేయర్లు, ఛైర్‌పర్సన్లుగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే దానిపై స్పష్టత వచ్చింది. ఇప్పుడు ప్రమాణ స్వీకారంతో కొత్త పాలకవర్గాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టనున్నారు.

డిప్యూటీ పదవులకూ ఎన్నికలు

మేయర్లు, ఛైర్‌పర్సన్ల ప్రమాణ స్వీకారంతో పాటు డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్ల ఎన్నికకు కూడా ఎస్ఈసీ నవంబర్ 23న ఉదయం 11 గంటలకు షెడ్యూల్ ప్రకటించింది. 13 కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్లను, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వైస్ ఛైర్‌పర్సన్లను ఎన్నుకోనున్నారు. ఇందుకోసం ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. సంబంధిత జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులు ఈ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

ప్రత్యక్ష ఎన్నికలతో మారిన విధానం

గతంలో మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లను పరోక్ష పద్ధతిలో వార్డు సభ్యులు ఎన్నుకునేవారు. అయితే ఈసారి ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులతో మేయర్లు, ఛైర్‌పర్సన్లకు ప్రజలే నేరుగా ఓటు వేసి ఎన్నుకున్నారు. డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్ల ఎన్నిక మాత్రం పరోక్ష విధానంలోనే జరగనుంది. ఇందుకు అనుగుణంగా గతంలో జారీ చేసిన మార్గదర్శకాలను సవరించి ఎస్ఈసీ తాజా ఉత్తర్వులు జారీ చేసింది.

కొత్త పాలకవర్గాల ఏర్పాటుకు మార్గం

మేయర్లు, ఛైర్‌పర్సన్లతో పాటు డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్ల ఎన్నికలు పూర్తయితే పట్టణ స్థానిక సంస్థల్లో పాలకవర్గాల ఏర్పాటు ప్రక్రియ పూర్తవుతుంది. ఎన్నికైన ప్రజాప్రతినిధులు బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, పట్టణ మౌలిక సదుపాయాలపై దృష్టి సారించనున్నారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు
- 992 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, అవసరమైన వసతులు కల్పన
- 16 జెడ్పీటీసీ స్థానాలకు 55 మంది అభ్యర్థులు పోటీలో
- 276 ఎంపీటీసీ స్థానాలకు పోటీపడుతున్న 631 మంది అభ్యర్థులు
- మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఈ నెల 5న సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఎన్నికల నిర్వహణకు కావాల్సిన వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. జెడ్పీ సీఈవో పి.సుశీలతో కలిసి బుధవారం నగరంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, పారదర్శక ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం పూర్తి సంసిద్ధతతో ఉందని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 992 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 16 జెడ్పీటీసీ స్థానాలకు 55 మంది అభ్యర్థులు, 276 ఎంపీటీసీ స్థానాలకు 631 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు వివరించారు. మొత్తం 8,35,515 మంది ఓటర్లు ఉన్నారని, ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సౌకర్యార్థం సహాయ కేంద్రం (హెల్ప్ డెస్క్) అందుబాటులో ఉంటుందని తెలిపారు. పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు మొత్తం 1,324 మంది పీవోలు, 1,283 మంది ఏపీవోలు, 3,959 మంది ఓపీవోలకు అవగాహన కల్పించి విధుల నిర్వహణకు సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రిసైడింగ్ అధికారులకు ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ అప్లికేషన్ ద్వారా ఎప్పటికప్పుడు పోలింగ్ శాతాన్ని నమోదు చేసి, తక్షణమే తాజా వివరాలను పంపించేలా ఏర్పాట్లు చేశామన్నారు. 496 పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, 291 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ పారదర్శకతను పెంపొందించేందుకు అదనంగా 205 మంది వీడియోగ్రాఫర్లు, 191 మంది సూక్ష్మ పరిశీలకులను (మైక్రో అబ్జర్వర్లు) నియమించినట్లు పేర్కొన్నారు. మొత్తం 89 రూట్లు, 45 జోన్లు ఏర్పాటుచేశామని.. పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు సమర్థవంతమైన సమన్వయం, నిరంతర పర్యవేక్షణ కోసం రూట్ అధికారులు, జోనల్ అధికారులను నియమించామన్నారు. ఎన్నికల సిబ్బంది, అవసరమైన ఎన్నికల సామగ్రిని సకాలంలో పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు 188 బస్సులను ప్రత్యేకంగా కేటాయించామని తెలిపారు. దివ్యాంగ ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్లను అందుబాటులో ఉంచామని, తాగునీటి సదుపాయం, నీడ, అవసరమైన క్యూలైన్లతో పాటు ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాలను సులభంగా గుర్తించేలా అవసరమైన సైన్ బోర్డులను, వైద్య శిబిరాలను, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లో ఉంటుందని.. ఉల్లంఘనలపై ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా చర్యలు ఉంటాయని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఏవైనా ఫిర్యాదులు వస్తే పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోనూ 91549 70454 నంబరుతో కమాండ్ కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉందని తెలిపారు.

అభివృద్ధికి పునరంకితం



- జిల్లాలో కూటమి ఘన విజయం ప్రజల నమ్మకానికి నిదర్శనం
- విజయవాడ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం
- 86 డివిజన్లలో 78 స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయం
- మేయర్ వంగవీటి రాధాకృష్ణకు ఎంపీ కేశినేని చిన్ని కార్యాలయంలో ఘన సన్మానం
- రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ సమష్టి విజయమే లక్ష్యం



విజయవాడ, మహానగర్

జిల్లా వ్యాప్తంగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన ఘన విజయం ప్రజలు తమపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. ప్రజలు అందించిన విజయాన్ని మరింత బాధ్యతగా భావిస్తూ నగర, జిల్లా అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి నాయకులు సమన్వయంతో పనిచేస్తారని స్పష్టం చేశారు. విజయవాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడంతో నగరంలో కూటమి శ్రేణుల సంబరాలు అంబరాన్నంటాయి. నూతన మేయర్‌గా ఎన్నికైన వంగవీటి రాధాకృష్ణకు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జి మక్కెన మల్లికార్జునరావు, బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు బుద్దా వెంకన్న, గద్దె అనురాధ తదితరులు పాల్గొని నూతన మేయర్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ విజయవాడ ప్రజలు వంగవీటి రాధాకృష్ణకు మేయర్‌గా పట్టం కట్టి కూటమిపై తమకున్న విశ్వాసాన్ని చాటిచెప్పారన్నారు. మొత్తం 86 డివిజన్లలో ఎనిమిది మినహా మిగిలిన అన్ని డివిజన్లలో కూటమి అభ్యర్థులు విజయం సాధించారని, 76 స్థానాల్లో గెలుస్తామని అంచనా వేయగా 78 స్థానాలను కైవసం చేసుకోవడం విశేషమని పేర్కొన్నారు. ఓటింగ్ శాతం తక్కువగా నమోదైనప్పటికీ ప్రజలు కూటమికి ఘన విజయాన్ని అందించారని, ఓటింగ్ శాతం మరింత పెరిగి ఉంటే రెండు లక్షల మెజారిటీని కూడా దాటి ఉండేవారమని అభిప్రాయపడ్డారు. ఈ విజయం తమపై మరింత బాధ్యతను పెంచిందని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ విజయవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పునరంకితమవుతామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు నగరంలో కూటమి పాలకవర్గం సమన్వయంతో పనిచేసే ట్రిపుల్ ఇంజిన్ ప్రభుత్వంతో అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారనేందుకు ఎన్నికల ఫలితాలే నిదర్శనమని, ఈవీఎంల ద్వారా జరిగినా, బ్యాలెట్ పద్ధతిలో జరిగినా ప్రజల మద్దతు కూటమికే ఉంటుందని ఈ ఫలితాలు నిరూపించాయని పేర్కొన్నారు. సీట్ల పంపిణీ విషయంలో నిర్ణయం కొంత ఆలస్యం కావడం, ఇతర కారణాల వల్ల మరో మూడు, నాలుగు స్థానాల్లో విజయావకాశాలు కోల్పోయామని తెలిపారు. అయినప్పటికీ కూటమి నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి ఫలితాన్ని సాధించారని అభినందించారు. ఏబీ వెంకటేశ్వరరావుతో పాటు ప్రజలకు, పార్టీకి ఉపయోగపడేలా ఎవరైనా మంచి సూచనలు చేస్తే వాటిని స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. వైసీపీతో పాటు ఇతర పక్షాలు చేసిన అసత్య ప్రచారాలను ప్రజలు విశ్వసించలేదని, అభివృద్ధి, సంక్షేమం, ప్రజా విశ్వాసానికే ఓటు వేశారని ఎంపీ పేర్కొన్నారు. ఇదే సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయని, కూటమి భాగస్వామ్య పక్షాల అభ్యర్థులు మంచి విజయాలు సాధించారని తెలిపారు. క్షేత్రస్థాయి కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో, సమిష్టి కృషితో పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎప్పుడూ తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉందని, తాజా ఫలితాలు మరోసారి ఆ విషయాన్ని నిరూపించాయని పేర్కొన్నారు. తిరువూరు నుంచి జనసేన పార్టీ అభ్యర్థి భారీ మెజారిటీతో విజయం సాధించడంతో పాటు, జనసేన మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ కూడా గెలుపొందారని, మరో మూడు స్థానాల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయం సాధించారని వివరించారు. జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ ఆధ్వర్యంలో కూటమి నాయకులందరూ ఐక్యంగా ముందుకు సాగుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. ఎన్నికల సమయంలో సహకరించిన అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా ఎన్నికల ప్రక్రియలో సమన్వయంతో వ్యవహరించి సహకరించిన మల్లికార్జున్, ప్రశాంత్ తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నూతన మేయర్ వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ



తనకు మేయర్‌గా అవకాశం కల్పించిన జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, తనను ప్రోత్సహించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ ప్రజలు తనపై చూపిన అభిమానానికి, నమ్మకానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తన విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా నిలిచాయని, ఎంపీ కేశినేని చిన్ని, విజయవాడలోని మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తనకు అండగా నిలిచి విజయం కోసం కృషి చేశారని తెలిపారు. విజయవాడ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని, అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లను కలుపుకొని నగరంలోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రభుత్వ సహకారంతో నగర అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని వెల్లడించారు. తన గెలుపు కోసం కూటమి అభ్యర్థులందరూ సమష్టిగా కృషి చేశారని, ప్రతి కార్పొరేటర్ తన విజయాన్ని బాధ్యతగా తీసుకొని పనిచేశారని కొనియాడారు. ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. "ఈ గెలుపు నాది కాదు.. ఇది విజయవాడ ప్రజల గెలుపు. నాపై నమ్మకం ఉంచి మేయర్‌గా అవకాశం కల్పించిన ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ విజయవాడను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తాను" అని రాధాకృష్ణ స్పష్టం చేశారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ కూటమి సమష్టి కృషితో విజయం సాధిస్తుందని ఎంపీ చిన్ని ధీమా వ్యక్తం చేశారు. సీట్ల సర్దుబాటులో భాగంగా రెండు స్థానాల్లో జనసేన, ఒక స్థానంలో బీజేపీ, మిగిలిన 14 స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు పోటీ చేయనున్నారని తెలిపారు. మొత్తం 17 స్థానాల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లా జెడ్పీ చైర్మన్ పదవి ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వ్ అయిందని, టీడీపీకి చెందిన జెడ్పీటీసీ సభ్యులు ఉన్న నేపథ్యంలో చైర్మన్ అభ్యర్థి ఎంపికపై పార్టీ అధిష్ఠానం తగిన నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రజలు మంచి పాలనను కోరుకుంటున్నారని, కూటమి ప్రభుత్వంపై ఉన్న విశ్వాసంతోనే ఈ స్థాయిలో విజయాన్ని అందించారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లోనూ ఇదే ఐక్యత, సమన్వయం, క్రమశిక్షణతో ముందుకు సాగుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని కేశినేని చిన్ని స్పష్టం చేశారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, తాగునీరు, రహదారుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ విజయవాడను అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు ఎంపీ, ఎమ్మెల్యేలు, మేయర్, కార్పొరేటర్ల సమన్వయంతో పనిచేస్తారని కూటమి నేతలు ఆకాంక్షించారు.

వంగవీటి రాధాకృష్ణకు ఘన సన్మానం



విజయవాడ, మహానగర్

నగర మేయర్‌గా ఘన విజయం సాధించిన వంగవీటి రాధాకృష్ణను జనసేన పార్టీ సీనియర్ నాయకులు పెనుగొండ సుబ్బారాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ అభినందించారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాల మేరకు బుధవారం బందర్ రోడ్డులోని రాధాకృష్ణ కార్యాలయానికి వెళ్లిన వారు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు. మేయర్ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. వంగవీటి రాధాకృష్ణ నాయకత్వంలో విజయవాడ నగరం మరింత అభివృద్ధి పథంలో పయనిస్తుందని పెనుగొండ సుబ్బారాయుడు, ప్రత్తిపాటి శ్రీధర్ ఆకాంక్షించారు.

హిమాలయ బేబీకేర్
పెహ్లా వింటర్‌కా పెహ్లా లేయర్ ప్రచారం ప్రారంభం



విశాఖపట్నం, మహానగర్

పసిబిడ్డల తొలి చలికాలంలో వారి సున్నితమైన చర్మ సంరక్షణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించే లక్ష్యంతో ప్రముఖ బేబీకేర్ బ్రాండ్ హిమాలయ బేబీకేర్ 'పెహ్లా వింటర్ కా పెహ్లా లేయర్' (తొలి చలికాలానికి తొలి రక్షణ పొర) పేరుతో ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా రూపొందించిన ప్రధాన చిత్రంతో పాటు ఆరు లఘు చిత్రాల ద్వారా చలికాలంలో బేబీ ఉత్పత్తుల వినియోగం, అలర్జీలపై సందేహాలు, ఆయిల్‌తో పాటు లోషన్ లేదా క్రీమ్ అవసరాన్ని వివరించింది. సంస్థకు చెందిన జెంటిల్ బేబీ లోషన్, బేబీ క్రీమ్‌లు 97 శాతం ప్రకృతిసిద్ధమైన పదార్థాలు, పెంటా మాయిశ్చర్ లాక్ సాంకేతికత, పీహెచ్ 5.5 సమతుల్యతతో రూపొందించినట్లు వెల్లడించింది. ఇవి చిన్నారుల చర్మానికి తేమను అందించి, రోజంతా సంరక్షణ కల్పించడంలో సహాయపడతాయని తెలిపింది.

పండుగ వేడుకల్లో రాయల్ స్టాగ్ ఏఐ ప్రచారం



విజయవాడ, మహానగర్

పండుగ వేడుకలను చిరస్మరణీయంగా మార్చే వ్యక్తుల ప్రత్యేకతను గౌరవించే లక్ష్యంతో సీగ్రామ్‌కు చెందిన రాయల్ స్టాగ్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ వినూత్న ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'ఈ పండుగ సీజన్‌లో ప్రతి ఒక్కరిలోని ప్రత్యేకతను వేడుక చేసుకుందాం' అనే ఇతివృత్తంతో చేపట్టిన ఈ ప్రచారంలో క్రికెటర్ రోహిత్ శర్మ, నటుడు రాహుల్ దువా, నటి మాన్వి గగ్రూ భాగమయ్యారు. జనరేటివ్ ఏఐ సాంకేతికతతో రూపొందించిన ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారులు రోహిత్ శర్మతో పాటు తమ ఫొటోతో వ్యక్తిగతీకరించిన పండుగ శుభాకాంక్షల వీడియో సందేశాలను రూపొందించుకోవచ్చు. వీటిని స్నేహితులు, కుటుంబ సభ్యులతో పంచుకోవచ్చు. పెర్నోడ్ రికార్డ్ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ దేబశ్రీ దాస్‌గుప్తా మాట్లాడుతూ, ఆత్మీయుల పట్ల అభిమానాన్ని వినూత్నంగా వ్యక్తపరిచేందుకు ఈ ప్రచారం దోహదపడుతుందని తెలిపారు. డిజిటల్, ప్రింట్, అవుట్ ఆఫ్ హోమ్ మీడియా వేదికలపై ఈ ప్రచారం అందుబాటులో ఉంటుందని సంస్థ వెల్లడించింది.

తుఫాన్ల అనంతరం వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విజయవాడ, మహానగర్

వరుసగా అర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంతో అతలాకుతలమైన కోస్తాంధ్ర ప్రజలు తుఫాన్ల అనంతరం తలెత్తే ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ సూచించింది. ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, ఉభయ గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో కలుషిత నీరు, నిల్వ నీటి కారణంగా టైఫాయిడ్, కలరా, హెపటైటిస్-ఎ, డయేరియా, డెంగ్యూ, మలేరియా వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని హెచ్చరించింది. కాచి చల్లార్చిన లేదా క్లోరినేట్ చేసిన నీటిని తాగాలని, ఆహార పరిశుభ్రత పాటించాలని, నిల్వ నీటిని తొలగించాలని సూచించింది. జ్వరం, వాంతులు, విరేచనాలు, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే స్వీయచికిత్సకు దూరంగా ఉండి వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరింది. పాలసీదారులకు టెలీ కన్సల్టేషన్, క్యాష్‌లెస్ హోమ్ హెల్త్‌కేర్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. వివరాలకు 7200 222 333 నంబరును సంప్రదించాలని సూచించింది.

దేశంలో పేదరికం అంత తగ్గిందా!?

దశాబ్ద కాలంలో ఆర్థిక, ఆర్థికేతర అంశాల్లో పేదరికాన్ని తగ్గించడంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని ప్రపంచ బ్యాంక్ నివేదిక తెలిపింది.ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా పేదరికాన్ని తగ్గిస్తున్న దేశాల్లో భారత్ కూడా ఒకటని ఆ నివేదిక పేర్కొంది. 'భారత్‌లో పేదరికం, సమానత్వం' పేరుతో ప్రపంచ బ్యాంక్ ఈ నివేదిక విడుదల చేసింది.దారిద్ర్య రేఖకు దిగువన అంటే రోజుకు 4.2డాలర్ల (సుమారు రూ. 399) కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్న జనాభా శాతం 2011 నుంచి 2023 మధ్య 57.7 శాతం నుంచి 16.1 శాతానికి తగ్గింది" అని నివేదికలో ప్రపంచబ్యాంక్ తెలిపింది.ఈ కాలంలో 49.6 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారు. అదే సమయంలో తీవ్ర పేదరికంలో అంటే రోజుకు 3 డాలర్ల (సుమారు రూ. 285)కంటే తక్కువ ఆదాయంతో నివసిస్తున్న జనాభా 27.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గింది" అని వెల్లడించింది.భారత్‌లో పేదరికం తగ్గడం కొనసాగుతుందని, అయితే ఈ తగ్గుదల వేగం కొంత నెమ్మదించవచ్చని అంచనావేస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు పేర్కొంది.రోజుకు రూ. 399 ఆదాయాన్నిదారిద్ర్య రేఖగా గుర్తిస్తే 2026లో 14.2 శాతంగా ఉన్నపేదరికం రేటు 2028 నాటికి 12.1 శాతానికి తగ్గవచ్చని అంచనావేసింది."ఆర్థికేతర ప్రమాణాల ఆధారంగా పేదరికాన్ని అంచనావేయడానికి ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ (ఓపీహెచ్ఐ) రూపొందించిన మల్టిడైమన్షనల్ పావర్టీ ఇండెక్స్ (ఎంపీఐ) ఆధారంగా అంచనా వేస్తారు.2005-06లో పేదరికం రేటు 53.8 శాతంగా ఉండగా అది 2019-21 నాటికి 16.4 శాతానికి తగ్గింది. 2022-23లో ఈ రేటు 15.5 శాతంగా ఉందని ప్రపంచ బ్యాంకు బహుముఖ పేదరిక సూచీ తెలిపింది.భారత్‌లో పేదరికం తగ్గుతున్నప్పటికీ ఆర్థిక అసమానతలు పెరుగుతున్న సమస్య మాత్రం అలాగే ఉంది."నిజానికి ప్రజలెంత ఖర్చుచేస్తున్నారనేదాని ఆధారంగా అసమానతలను లెక్కిస్తే అవి చాలా తక్కువగా కనిపిస్తాయి. ఆదాయాలను పోల్చిచూస్తే అసమానత చాలా ఎక్కువగా ఉంటుంది" అని ఇండియాటుడే నిర్వహించిన కార్యక్రమంలో ఆర్థికవేత్త సంతోష్ మెహ్రోత్రా చెప్పారు."భారత్‌లో ప్రజల ఆదాయాలకు సంబంధించి అసలు సర్వేలే నిర్వహించడం లేదు. మన దేశంలో ఆర్థిక అసమానతలు చాలా తీవ్రమైన సమస్య. అది మరింత తీవ్రమైంది. మనం దీనిని నిర్లక్ష్యం చేయకూడదు" అని ఆయన అన్నారు.ప్రపంచబ్యాంక్ నివేదికలోని అంశాలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్వాగతించారు. నివేదిక గణాంకాల్లోని సానుకూల అంశాలను సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌లో ఆమె ప్రస్తావించారు."ప్రజల వినియోగం గణనీయంగా పెరగడం, ముఖ్యంగా మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడం, ఆహార సబ్సిడీతో పాటు సామాజిక సంక్షేమ పథకాల విస్తరణ వంటివి పేదరికం తగ్గడానికి ప్రధాన కారణాలని ప్రపంచ బ్యాంకు గుర్తించింది" అని నిర్మాలా సీతారామన్ అన్నారు."ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం అమలుచేస్తున్న విధానపరమైన ప్రయత్నాలు స్పష్టమైన ఫలితాలను ఇస్తున్నాయి. దీంతో అందరికీ అభివృద్ధి ఫలాలు అందించే సమ్మిళిత వృద్ధికి, ప్రజలకు మరిన్ని ఆర్థిక అవకాశాలు కల్పించడానికి బలమైన పునాది ఏర్పడుతోంది" అని ఆమె విశ్లేషించారు.పేదరికం తగ్గినప్పటికీ కొన్ని వర్గాల కుటుంబాల్లో ఇప్పుడది ఎక్కువగా కనిపిస్తోందని ప్రపంచ బ్యాంక్ నివేదిక తెలిపింది.విద్యాస్థాయి తక్కువగా ఉన్నవాళ్లు, ఆస్తులు తక్కువగా ఉన్నవాళ్లు, స్థిరమైన ఉపాధి పొందే అవకాశాలు పరిమితంగా ఉన్నవాళ్లు, కుటుంబపోషణ భారం ఎక్కువగా ఉన్నవాళ్ల కుటుంబాల్లో పేదరికం ఎక్కువగా ఉందని ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొంది. కూలీల వేతనాల మధ్య అసమానతలు ఇప్పటికీ చాలా ఎక్కువగా ఉన్నాయని నివేదిక తెలిపింది. 2023లో అత్యధిక వేతనాలు పొందుతున్న పది శాతం కార్మికుల సగటు వేతనం, అతి తక్కువ వేతనాలు పొందుతున్న 10 శాతం కార్మికుల సగటు వేతనం కంటే దాదాపు 13 రెట్లు ఎక్కువగా ఉంది" అని నివేదిక పేర్కొంది."కొన్ని ప్రత్యేక భౌగోళిక ప్రాంతాల్లో పేదరికం ఎక్కువగా ఉందని కూడా నివేదిక పేర్కొంది.చాలా రాష్ట్రాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పటికీ దేశంలోని మొత్తం పేద జనాభాలో సుమారు 57 శాతం జనాభా ఉత్తర ప్రదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు వరుసగా ఉన్న ప్రాంతాల్లోనే నివసిస్తోంది" అని నివేదిక పేర్కొంది.2017 నుంచి 2023 మధ్యకాలంలో ఉద్యోగాలు, ఉపాధి పొందుతున్నవాళ్ల సంఖ్య సుమారు 13.4 కోట్లు పెరిగిందని కూడా నివేదిక పేర్కొంది. పని చేసే వయసులో ఉన్న జనాభా పెరుగుదలతో పోలిస్తే ఉపాధి పొందుతున్న వారి సంఖ్య దాదాపు రెట్టింపు పెరిగింది. ఈ ఉపాధి పెరుగుదలలో ఎక్కువ భాగం గ్రామీణప్రాంతాల్లో మహిళలు జీతం వచ్చే పనుల్లో చేరడం వల్లే సాధ్యమైంది. దీనివల్ల కుటుంబంలో సంపాదించే సభ్యుల సంఖ్య పెరిగింది.అయితే యువతలో నిరుద్యోగం పెరిగిన విషయాన్ని కూడా ప్రపంచ బ్యాంక్ ప్రత్యేకంగా ప్రస్తావించింది.2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం నుంచి 2027-28 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం మధ్య యువతలో నిరుద్యోగ రేటు 14.6 శాతం నుంచి 15.9 శాతానికి పెరిగింది. ఈ ప్రభావం ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువతులపై ఎక్కువగా పడిందని నివేదిక తెలిపింది.అంతేకాకుండా ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకున్నతర్వాత లెక్కించే వాస్తవ వేతనాల్లో పెద్దగా మార్పులేదని నివేదిక పేర్కొంది. అదే సమయంలో ఉపాధి పెరిగినప్పటికీ ఎక్కువ ఉత్పాదకత లేని పనుల్లోనే ఈ పెరుగుదల ప్రధానంగా కనిపించిందని తెలిపింది.

అమెరికా మధ్యంతర ఎన్నికలు



ఫ్లోరిడా : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీకాలంలోని చివరి రెండేళ్లలో కాంగ్రెస్‌పై ఎవరికి పట్టు ఉంటుందో తేల్చే మధ్యంతర ఎన్నికల పోలింగ్ మంగళవారం ముగిసింది. దేశవ్యాప్తంగా ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు, 100 మంది సభ్యులున్న సెనెట్‌లోని 37 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటితో పాటు 36 రాష్ట్రాల్లో గవర్నర్ పదవులకు కూడా ఓటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో భారత సంతతికి చెందిన అభ్యర్థులు కీలక పదవుల కోసం పోటీ పడుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన డెమోక్రటిక్ నేత సుహాస్ సుబ్రమణ్యం ఘన విజయం సాధించారు. వర్జీనియాలోని 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి పోటీ చేసిన ఆయన, 61 శాతానికి పైగా ఓట్లు సాధించి ప్రతినిధుల సభకు తిరిగి ఎన్నికయ్యారు. ఆయన ప్రత్యర్థి, రిపబ్లికన్ అభ్యర్థి డేవ్ బెక్‌విత్‌కు 36 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. గతంలో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు వైట్‌హౌస్‌లో టెక్నాలజీ పాలసీ సలహాదారుగా సుహాస్ పనిచేశారు. అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న ఒహాయో గవర్నర్ పదవికి రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ పడుతున్న భారత సంతతి వ్యాపారవేత్త వివేక్ రామస్వామి ప్రస్తుతం వెనుకంజలో ఉన్నారు. కేరళ మూలాలున్న వివేక్‌కు అధ్యక్షుడు ట్రంప్ మద్దతు ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం, ఆయన తన ప్రత్యర్థి, డెమోక్రటిక్ అభ్యర్థి అమీ యాక్టన్ కంటే దాదాపు 2,00,000 ఓట్ల వెనుకంజలో ఉన్నారు. మరోవైపు ఫ్లోరిడా 22వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి డెమోక్రటిక్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పియా దండియా ఆధిక్యంలో కొనసాగుతున్నారు. మాజీ హైస్కూల్ ప్రిన్సిపాల్ అయిన ఆమె, రిపబ్లికన్ అభ్యర్థి కేసీ అస్కర్‌పై దాదాపు 11,000 ఓట్ల ఆధిక్యంతో ముందంజలో ఉన్నారు. సిలికాన్ వ్యాలీలోని కొన్ని ప్రాంతాలున్న కాలిఫోర్నియా 17వ డిస్ట్రిక్ట్‌లో ఇద్దరు భారత సంతతి నేతల మధ్య ఆసక్తికర పోరు నెలకొంది. ఇక్కడ డెమోక్రటిక్ కాంగ్రెస్ సభ్యుడు రో ఖన్నాపై రిపబ్లికన్ నేత రితేష్ టాండన్ పోటీ చేస్తున్నారు. అలాగే వాషింగ్టన్‌లోని 7వ డిస్ట్రిక్ట్‌లో సిట్టింగ్ కాంగ్రెస్ సభ్యురాలు ప్రమీలా జయపాల్‌పై మరో భారత సంతతికి చెందిన రిపబ్లికన్ నేత నీరవ్ సేథ్ బరిలో ఉన్నారు. ఈ రెండు చోట్లా ఫలితాలు ఇంకా వెలువడలేదు. వీరితో పాటు సిట్టింగ్ కాంగ్రెస్ సభ్యుడు అమీ బేరా (కాలిఫోర్నియా), అమిష్ షా (అరిజోనా), పూజా సేథి (టెక్సాస్), సందీప్ శ్రీవాస్తవ (టెక్సాస్) వంటి అనేకమంది భారత సంతతి అభ్యర్థులు వివిధ స్థానాల నుంచి పోటీ పడుతున్నారు. లాస్ ఏంజిల్స్ నగర మేయర్ పదవికి నిత్యా రామన్ పోటీ చేస్తున్నారు. ఆమె గెలిస్తే, అమెరికాలోని రెండు అతిపెద్ద నగరాలైన న్యూయార్క్, లాస్ ఏంజిల్స్‌కు భారత సంతతికి చెందినవారే మేయర్లుగా ఉంటారు. కొన్ని చోట్ల ఫలితాలు వెలువడినప్పటికీ, పలువురు కీలక భారత సంతతి అభ్యర్థుల భవితవ్యం తేలాల్సి ఉండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సోషల్ మీడియాలో కాదు.. దమ్ముంటే సభలో చర్చకు రండి





బహిరంగ చర్చకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సిద్ధమా? అంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విసిరిన సవాల్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. చర్చలకు సరైన వేదిక పార్లమెంట్ అని, సోషల్ మీడియా కాదని తేల్చిచెప్పారు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతాలో రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె వరుస పోస్టులు చేశారు. "రాహుల్ జీ, చర్చకు వేదికను ఎంచుకోమని మీరు ప్రధానిని కోరుతున్నారు. దానికి ఇప్పటికే ఒక వేదిక ఉంది, అదే పార్లమెంట్. దానికి మీరే ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు" అని నిర్మల పేర్కొన్నారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), ఈవీఎంల పనితీరుపై చర్చించేందుకు పార్లమెంటులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేద్దామని హోంమంత్రి అమిత్ షా సోమవారమే ప్రతిపాదించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. "సోషల్ మీడియాలో సవాళు విసిరినంత ఉత్సాహం పార్లమెంటులో చర్చకు ఎందుకు చూపించడం లేదు?" అని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు సభ నుంచి వాకౌట్ చేస్తున్నారని నిర్మలా సీతారామన్ ఆరోపించారు. "సమాధానాలు డిమాండ్ చేసేటప్పుడు, వాటిని వినే బాధ్యత కూడా ఉంటుంది. ఎన్నోసార్లు మీరు, మీ పార్టీ సభ్యులు ప్రభుత్వం స్పందిస్తున్న సమయంలోనే సభ నుంచి వాకౌట్ చేశారు. అలాంటప్పుడు చర్చకు అంత ఆసక్తిగా ఉన్నామని ఎలా చెప్పుకుంటారు?" అని ఆమె నిలదీశారు. ప్రతిపక్షాల ఆందోళనలతో పార్లమెంట్ సమావేశాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతున్నాయని ఆమె విమర్శించారు. "మీకు చర్చపై నిజంగా అంత ఆసక్తి ఉంటే, ముందు పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా సాగేలా సహకరించవచ్చు కదా?" అని ప్రశ్నించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నివాసంలో నిర్వహించిన "మాక్ పార్లమెంట్" కార్యక్రమాన్ని కూడా ఆమె తప్పుబట్టారు. అది "మాక్ పార్లమెంట్" కన్నా "పార్లమెంటును అపహాస్యం చేయడం"లా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి మాట్లాడేవారు ముందుగా ప్రజాస్వామ్య సంస్థలను గౌరవించాలని హితవు పలికారు. "'డరో మత్' (భయపడొద్దు) అని మీరు అంటుంటారు కదా. అలాంటప్పుడు వాస్తవాలతో, ఆధారాలతో సభకు రండి, విమర్శలను ఎదుర్కోండి, సమాధానాలు వినడానికి కూర్చోండి" అని రాహుల్ గాంధీకి నిర్మలా సీతారామన్ సవాల్ విసిరారు.

ట్రంప్‌కు సవాలు విసురుతున్న జోన్ ఓసోఫ్

జార్జియా నుంచి మళ్లీ గెలుపు!

- డెమోక్రాటిక్ జోన్ ఓసోఫ్ ఘన విజయం

- రిపబ్లికన్ ప్రత్యర్థి మైక్ కాలిన్స్‌పై గెలిచి రెండోసారి సెనేటర్‌గా ఎన్నిక

- ట్రంప్ గెలిచిన రాష్ట్రంలో కీలక సీటును నిలబెట్టుకున్న డెమోక్రాట్లు

- ఓసోఫ్ జాతీయ స్థాయిలో కీలక నేతగా ఎదుగుతున్నారని విశ్లేషణలు



జార్జియా : అమెరికా సెనేట్‌లో అత్యంత పిన్న వయస్కుడైన సభ్యుడిగా ఇప్పటికే చరిత్ర సృష్టించిన 39 ఏళ్ల జాన్ ఓసోఫ్ మరోసారి రికార్డులకెక్కారు. నిన్న జరిగిన అమెరికా మధ్యంతర ఎన్నికల్లో జార్జియా నుంచి మరోమారు ఘన విజయం సాధించి రిపబ్లికన్ల ఆశలు అడియాసలు చేశారు. తీవ్ర ఉత్కంఠ కలిగించిన ఈ పోరులో ఓసోఫ్.. తన సమీప రిపబ్లికన్ ప్రత్యర్థి మైక్ కాలిన్స్‌పై స్పష్టమైన ఆధిక్యంతో గెలుపొందారు. గత అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఆధిక్యం ప్రదర్శించిన జార్జియాలో ఓసోఫ్ విజయం సాధించి అత్యంత పిన్న వయస్కుడిగా, మొదటి మిలీనియల్‌గా రికార్డులకెక్కారు. దీంతో ఈసారి సెనేట్ సీటును ఎలాగైనా కైవసం చేసుకోవాలని రిపబ్లికన్లు సర్వశక్తులు ఒడ్డారు. కానీ, వారి వ్యూహాలకు గండి కొడుతూ ఓసోఫ్ తన స్థానాన్ని పదిలపరుచుకున్నారు. ఈ విజయంతో, సెనేట్‌లో మెజారిటీ కోసం పోరాడుతున్న డెమోక్రాట్లకు కీలకమైన ఊరట లభించింది. జార్జియాలోని రెండు సెనేట్ స్థానాలు ఇప్పుడు డెమోక్రాట్ల ఖాతాలోనే పదిలంగా ఉన్నాయి. ప్రచారంలో వ్యూహాత్మక పదును: ఓసోఫ్ విజయం వెనుక పక్కా ప్రణాళిక, వ్యూహాత్మక ప్రచారం ఉన్నాయి. ఓవైపు పెరుగుతున్న జీవన వ్యయం, ప్రభుత్వంలో నైతిక విలువల ఆవశ్యకతపై దృష్టి సారిస్తూనే, మరోవైపు అధ్యక్షుడు ట్రంప్ విధానాలపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రచారం కోసం ఏకంగా 100 మిలియన్ డాలర్లకు పైగా రికార్డు స్థాయిలో నిధులు సమీకరించి, ప్రత్యర్థులను ఆర్థికంగానూ దెబ్బతీశారు. మరోపక్క, ట్రంప్ మద్దతు ఉన్నప్పటికీ, రిపబ్లికన్ అభ్యర్థి మైక్ కాలిన్స్ నిధుల కొరత, గత వివాదాల కారణంగా వెనుకబడ్డారు. జాతీయ రాజకీయాల్లో కీలక శక్తిగా..: 2021లో సెనేటర్ రాఫెల్ వార్నాక్‌తో కలిసి జార్జియాలో డెమోక్రాటిక్ జెండా ఎగరేసిన ఓసోఫ్.. ఇప్పుడు తన సీటును నిలబెట్టుకోవడంతో పార్టీలో ఆయన పలుకుబడి మరింత పెరిగింది. ఆయన జాతీయ రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదుగుతున్నారని, భవిష్యత్తులో డెమోక్రాటిక్ పార్టీలో ఉన్నత పదవులు చేపట్టే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, తాను పూర్తికాలం సెనేటర్‌గా ప్రజలకు సేవ చేస్తానని ఆసాఫ్ స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు కొనసాగుతున్నప్పటికీ, ప్రధాన మీడియా సంస్థలన్నీ ఓసోఫ్ విజయాన్ని ఇప్పటికే ఖరారు చేశాయి.

అగ్నివీర్‌లకు కేంద్రం గుడ్‌న్యూస్

న్యూఢిల్లీ: అగ్నివీర్‌లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. అగ్నిపథ్ పథకంలో భాగంగా నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న తర్వాత బయటకు వెళ్లాల్సిన 75 శాతం మంది అగ్నివీర్‌లకు మరో రెండేళ్లపాటు సాయుధ దళాల్లో సేవలందించే అవకాశం కల్పించింది. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయం తీసుకుంది. అనంతరం చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి ఈ వివరాలను వెల్లడించారు.



75 శాతం మందికి రెండేళ్ల పొడిగింపు

2022 జూన్ 14న కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానం ప్రకారం ఎంపికైన అగ్నివీర్‌లు నాలుగేళ్లపాటు సైన్యంలో సేవలందించాలి. అనంతరం ప్రతిభ ఆధారంగా 25 శాతం మందిని రెగ్యులర్ సాయుధ దళాల్లోకి తీసుకోవాలని తొలుత నిర్ణయించారు. మిగిలిన 75 శాతం మంది సేవల నుంచి వైదొలగాల్సి ఉండేది. అయితే నాలుగేళ్ల పాటు అగ్నివీర్‌ల పనితీరును సమీక్షించిన తర్వాత సానుకూల ఫలితాలు రావడంతో కేంద్రం ఈ విధానంలో మార్పులు చేసింది. మిగిలిన 75 శాతం మందికి అదనంగా రెండేళ్లపాటు సేవలందించే అవకాశం కల్పించాలని నిర్ణయించింది.

ఆ తర్వాత రెగ్యులర్ సర్వీసులోకి..

రెండేళ్ల అదనపు సేవా కాలం పూర్తయిన తర్వాత సాయుధ దళాల్లో కొనసాగేందుకు ఆసక్తి చూపే అగ్నివీర్‌లను నిర్దిష్ట ఎంపిక ప్రమాణాల ఆధారంగా రెగ్యులర్ సర్వీసులోకి తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియలో అభ్యర్థుల అర్హత, పనితీరు, నిర్దేశిత ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుంటారు. అదనపు రెండేళ్ల సేవా కాలంలో గతంలో కంటే అధిక వేతనం కూడా అందించనున్నారు. ఈ నిర్ణయంతో అగ్నివీర్‌లకు సైన్యంలో కొనసాగేందుకు మరింత అవకాశం లభించనుంది.

నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన పథకం

దేశ రక్షణ దళాల్లో యువతకు అవకాశం కల్పించడం, సైన్యంలో యువశక్తిని పెంచడం లక్ష్యంగా కేంద్రం అగ్నిపథ్ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంపై ప్రారంభం నుంచి పలు విమర్శలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా నాలుగేళ్ల స్వల్ప సేవా కాలం తర్వాత 75 శాతం మంది బయటకు వెళ్లాల్సి రావడంపై అభ్యంతరాలు వచ్చాయి. వారికి భవిష్యత్తులో ఉద్యోగ భద్రతపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజా నిర్ణయం అగ్నివీర్‌లకు అదనపు అవకాశాలను కల్పించనుంది.

కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

మరోవైపు కేంద్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. చిన్నారులపై లైంగిక వేధింపులు, అత్యాచారాలకు సంబంధించిన కేసులను వేగంగా పరిష్కరించేందుకు దేశవ్యాప్తంగా 850 ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టులను కొనసాగించడం, బలోపేతం చేయడంపై నిర్ణయం తీసుకుంది. మహిళలు, చిన్నారులపై నేరాలకు సంబంధించిన కేసుల విచారణను వేగవంతం చేయడమే దీని లక్ష్యం.

ఇంధన నిల్వకు రూ.14,500 కోట్లు

పునరుత్పాదక ఇంధన రంగాన్ని బలోపేతం చేసేందుకు 92 గిగావాట్ అవర్ (+ఔష్ఠ) సామర్థ్యంతో గ్రిడ్ స్థాయి ఇంధన నిల్వ వ్యవస్థల అభివృద్ధికి రూ.14,500 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యానికి ఈ నిర్ణయం తోడ్పడనుంది.

కీలక ఖనిజాల ప్రాసెసింగ్‌కు ప్రోత్సాహం

సెమీకండక్టర్లు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్, రక్షణ పరికరాల తయారీ రంగాలకు అవసరమైన కీలక ఖనిజాల ప్రాసెసింగ్‌ను ప్రోత్సహించేందుకు రూ.2,814 కోట్లతో ప్రత్యేక పథకానికి కేంద్రం ఆమోదం తెలిపింది. లిథియం, నికెల్ వంటి ఖనిజాల ప్రాసెసింగ్‌తో పాటు ముడి పదార్థాల సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం ఈ పథకం లక్ష్యం.

మోదీని ఐదు నిమిషాల్లోనే ఎండగడతా!

సంగ్రూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రణలో పనిచేస్తున్నారని ఆరోపించారు. తనతో ముఖాముఖి చర్చకు వస్తే ఐదు నిమిషాల్లోనే మోదీని దేశద్రోహిగా నిరూపిస్తానని సంచలన వ్యాఖ్యలు చేశారు. మోదీతో చర్చకు సిద్ధమని, అందుకు మధ్యవర్తిగా ఎవరినైనా నియమించుకోవచ్చని సవాల్ విసిరారు. అయితే పార్లమెంటులో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా మైక్ కట్ చేస్తున్నారని ఆరోపించారు. పంజాబ్‌లోని సంగ్రూర్‌లో నిర్వహించిన 'ఇన్సాఫ్ ర్యాలీ'లో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఏడాదిలోపే ప్రభుత్వం కూలుతుంది

కేంద్ర హోంమంత్రి అమిత్ షాపైనా రాహుల్ విమర్శలు చేశారు. దేశంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు మూడేళ్ల గడువు విధించిన అమిత్ షా అప్పటికి ఆ పదవిలో ఉంటారో లేదోనని ఎద్దేవా చేశారు. తన అంచనా ప్రకారం ఏడాదిలోపే కేంద్ర ప్రభుత్వం కూలిపోతుందని జోస్యం చెప్పారు. గుజరాత్‌లోని అదానీ పోర్టులో గతంలో పట్టుబడిన వేల కిలోల మాదకద్రవ్యాలు, హెరాయిన్ సంగతేంటని ప్రశ్నించారు. వాటిపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.



డ్రగ్స్ నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్యను నిర్మూలిస్తామని అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయిందని రాహుల్ విమర్శించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాంతం నుంచైనా డ్రగ్స్‌ను పూర్తిగా తొలగించగలిగారా? అని ప్రశ్నించారు. ఈ సమస్యను పరిష్కరించే సామర్థ్యం ఆప్ ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. తాను గతంలోనే పంజాబ్‌లో డ్రగ్స్ సమస్య తీవ్రంగా ఉందని హెచ్చరించినప్పుడు, ప్రతిపక్ష పార్టీలు తన వ్యాఖ్యలను తప్పుబట్టాయని గుర్తుచేశారు.

అదానీ పోర్టులో డ్రగ్స్ ఏమయ్యాయి?

దేశంలో శాంతిభద్రతల గురించి మాట్లాడే ముందు మణిపుర్‌లో నెలకొన్న పరిస్థితులపై కేంద్రం సమాధానం చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. జైళ్లలో ఉన్న గ్యాంగ్‌స్టర్లకు రాజకీయ అండదండలు లభిస్తున్నాయని ఆరోపించారు. అమిత్ షా గ్యాంగ్‌స్టర్లను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, శాంతిభద్రతల సమస్యలపై కేంద్రం సమాధానం చెప్పాలని నిలదీశారు.

పంజాబ్‌కు కావాల్సింది ప్రజా ప్రభుత్వం

పంజాబ్‌లో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని రాహుల్ అన్నారు. ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. ప్రజల కోసం పనిచేయాలనుకునే వారిని బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం, చివరకు హత్యలు చేయడం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులకు అద్దం పడుతోందని ఆరోపించారు. పంజాబ్ ప్రజలకు తమ కోసం పనిచేసే ప్రభుత్వం కావాలని, ఢిల్లీ నుంచి నడిచే ప్రభుత్వం కాదని ఆప్ పాలనను విమర్శించారు. యువతకు ఉద్యోగాలు కల్పించడం, రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని పేర్కొంటూ వచ్చే ఎన్నికల్లో తమ పార్టీని గెలిపించాలని రాహుల్ పిలుపునిచ్చారు.

కొరియాలో మళ్లీ ఖాకీ వార్!

కొరియా: ఆంధ్రప్రదేశ్--ఒడిశా సరిహద్దులోని వివాదాస్పద కొరియా గ్రామాల్లో మరోసారి ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. గంజాయిభద్ర పంచాయతీ పరిధిలోని నేరళ్లవలస, దొరలతాడివలస, నేలవలస గ్రామాల్లో ఆధిపత్య పోరు మళ్లీ రాజుకుంది. నేరళ్లవలసకు నవంబర్ నెల రేషన్ బియ్యం పంపిణీ చేసేందుకు సోమవారం రాత్రి వెళ్లిన జీసీసీ వాహనాన్ని ఒడిశా పోలీసులు అడ్డుకోవడంతో వివాదం మొదలైంది. ఇప్పటికే రెండు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న సరిహద్దు వివాదానికి తోడు స్థానిక ఎన్నికల వ్యవహారం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది.

రేషన్ వాహనం అడ్డుకోవడంతో ఆగ్రహం

తమకు అందాల్సిన రేషన్ బియ్యం సరఫరాను అడ్డుకోవడంపై స్థానిక గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నేరళ్లవలసలోని ఒడిశా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఔట్‌పోస్టు వద్దకు చేరుకుని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బారికేడ్లు తొలగించాలని, అక్కడ ఏర్పాటు చేసిన టెంట్‌ను తీసివేయాలని డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అదనపు పోలీసు బలగాలు గ్రామానికి చేరుకున్నాయి. ఇదే సమయంలో ఒడిశాకు చెందిన రాజకీయ నాయకులు, వారి అనుచరులు సుమారు 60 మంది అక్కడికి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఒడిశా ప్రభుత్వ తీరును ప్రశ్నించిన కొందరు గిరిజనులపై వారు దాడికి పాల్పడ్డారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ప్రశాంతంగా జీవించే పరిస్థితి కల్పించాలని వారు కోరుతున్నారు.

ఓటు హక్కుపై ఒత్తిళ్లు?

ఏపీలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటు వేయవద్దంటూ ఒడిశా అధికారులు, రాజకీయ నాయకులు ఒత్తిడి తెస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఓటు హక్కు వినియోగించుకోకుండా అడ్డుకునేందుకు గ్రామానికి వచ్చి హెచ్చరికలు జారీ చేస్తున్నారని చెబుతున్నారు. తమకు రెండు రాష్ట్రాలతోనూ అనుబంధం ఉందని, రెండు రాష్ట్రాల ఎన్నికల్లోనూ ఓటు హక్కును వినియోగించుకుంటామని స్థానికులు స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ



ఒత్తిళ్లకు నిరసనగా కొందరు ఒడిశాకు చెందిన ఆధార్, రేషన్ కార్డులను అధికారుల ఎదుట పడేసినట్లు సమాచారం.

21 గ్రామాల్లో ఎన్నికల ఏర్పాట్లు

కొరియా పరిధిలోని 21 గ్రామాల్లో ఐదు ఎంపీటీసీ స్థానాలకు ఏపీ అధికారులు ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో మొత్తం 2,883 మంది ఓటర్లు ఉండగా, 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పోలింగ్ సమయం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో నెలకొన్న ఉద్రిక్తతలు ఎన్నికల నిర్వహణపై ప్రభావం చూపుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఒడిశా వైఖరి మరోలా..

మరోవైపు కొరియా ప్రజలు ఈ ఎన్నికలను వ్యతిరేకిస్తున్నారని ఒడిశా రెవెన్యూ మంత్రి సురేశ్ పూజారి తెలిపారు. ఎన్నికల సమయంలో అన్ని రాజకీయ పార్టీలు ఏకమై కొరియాను కాపాడాలని అఖిలపక్ష సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. తుపాను సమయంలో ఒడిశా ప్రభుత్వ యంత్రాంగం కొరియా ప్రజలకు అండగా నిలిచిందని, ఈ విషయాన్ని స్థానికులు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఏపీ నుంచి వచ్చిన బియ్యం వాహనాన్ని స్థానిక ప్రజలే వెనక్కి పంపించారని ఆయన చెప్పుకొచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం తరఫున చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, ఎనిమిది ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరించామని మంత్రి వెల్లడించారు. ఏపీ పరిపాలనా అధికారులను కూడా వెనక్కి పంపించినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో కొరియా పరిధిలోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఈసారి ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వైపు వాటిని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. పరిస్థితిని ఎదుర్కొనేందుకు తమ యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని సురేశ్ పూజారి వెల్లడించారు. రేషన్ బియ్యం సరఫరా నుంచి మొదలైన వివాదం ఇప్పుడు ఓటు హక్కు, పోలీసుల మోహరింపు, రాజకీయ జోక్యం వరకు చేరడంతో కొరియా గ్రామాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్చల ద్వారా సమస్యను పరిష్కరించి గిరిజనుల హక్కులకు భరోసా కల్పించాల్సిన అవసరం కనిపిస్తోంది.

సీఈసీ, ఈసీలకు జీవితకాల రక్షణపై సుప్రీం ప్రశ్నలు!

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు అధికారిక విధుల నిర్వహణలో తీసుకున్న నిర్ణయాలపై కల్పించిన చట్టపరమైన రక్షణ ఇప్పుడు సుప్రీంకోర్టు పరిశీలనకు వచ్చింది. ఈ రక్షణకు సంబంధించి 2023 చట్టంలోని సెక్షన్ 16 రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జయమాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

ఏమిటీ సెక్షన్ 16?

ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలానికి సంబంధించిన 2023 చట్టంలో సెక్షన్ 16ను చేర్చారు. ఈ నిబంధన ప్రకారం ప్రస్తుతం పదవిలో ఉన్న లేదా గతంలో సీఈసీ, ఎన్నికల కమిషనర్లుగా పనిచేసిన వ్యక్తులు తమ అధికారిక విధుల నిర్వహణలో చేసిన పనులు, తీసుకున్న చర్యలు లేదా వెలిబుచ్చిన మాటలకు సంబంధించి వారిపై సివిల్, క్రిమినల్ కేసులను కోర్టులు స్వీకరించడానికి లేదా కొనసాగించడానికి వీలుండదు. అంటే పదవిలో ఉన్న సమయంలోనే కాకుండా పదవీ విరమణ తర్వాత కూడా అధికారిక విధులకు సంబంధించిన చర్యలపై ఈ రక్షణ వర్తిస్తుంది. ఈ నిబంధనను సంపూర్ణ మినహాయింపుగా పరిగణిస్తున్న పిటిషనర్ దాని పరిధిని ప్రశ్నించారు.

సదుద్దేశంతో చేసిన పనులకే రక్షణ ఉండాలి

ప్రముఖ సామాజిక కార్యకర్త, న్యాయవాది అరుణ్ కుమార్ అగర్వాల్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరపున న్యాయవాది నేహా రాథీ వాదనలు వినిపించారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేయడానికి, అనవసరమైన రాజకీయ ఒత్తిళ్లు, వేధింపులకు గురికాకుండా ఉండటానికి రక్షణ అవసరమేనని పిటిషనర్ అంగీకరించారు. అయితే ఆ రక్షణ పేరుతో అధికారులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోకుండా పూర్తిస్థాయి నిషేధం విధించడం సరికాదని వాదించారు. ఇతర రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారికి కల్పించే రక్షణలకు సైతం కొన్ని పరిమితులు ఉన్నాయని, ముఖ్యంగా సదుద్దేశంతో (గుడ్ ఫెయిత్) విధులు నిర్వర్తించిన సందర్భాలకే రక్షణ వర్తించే విధానం ఉండాలని పేర్కొన్నారు. కానీ సెక్షన్ 16లో అలాంటి పరిమితులు లేకపోవడం రాజ్యాంగ విరుద్ధమని అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికార దుర్వినియోగం, అవినీతి లేదా చట్టవిరుద్ధమైన చర్యలకు కూడా ఈ నిబంధనను అడ్డుగా ఉపయోగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఓటర్ల జాబితా సవరణపైనా అభ్యంతరాలు

ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా ఉన్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కూడా పిటిషనర్ ప్రస్తావించారు. ఈ ప్రక్రియలో ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్ భద్రత, విశ్వసనీయత, పనితీరుపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు మీడియాలో వచ్చిన కథనాలను ఉదహరించారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత, సాంకేతిక వ్యవస్థల విశ్వసనీయత ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఏవైనా అవకతవకలు జరిగినప్పుడు బాధిత ఓటర్లు, అభ్యర్థులు న్యాయపరమైన పరిష్కారం కోరే అవకాశం ఉండాలని పిటిషనర్ వాదించారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడటం ఎంత ముఖ్యమో, దాని అధికారుల నిర్ణయాలకు జవాబుదారీతనం ఉండటం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు.

భూమిపైకి నాసా టెలిస్కోప్.. భారత్‌కూ ముప్పు!

వాషింగ్టన్: అంతరిక్ష రహస్యాలను ఛేదించడంలో దాదాపు 22 ఏళ్లపాటు సేవలందించిన నాసా 'నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ' భూమి వాతావరణంలోకి తిరిగి ప్రవేశించనుంది. నవంబర్ 4న ఈ ప్రక్రియ జరిగే అవకాశం ఉందని నాసా, అమెరికా అంతరిక్ష దళం అంచనా వేస్తున్నాయి. టెలిస్కోప్‌లోని అధిక భాగం వాతావరణంలోనే కాలిపోయే అవకాశమున్నప్పటికీ, కొన్ని భాగాలు శకలాల రూపంలో భూమిని చేరవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ శకలాలు పడే అవకాశం ఉన్న విస్తృత ప్రాంతంలో దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు కూడా ఉన్నాయి. అయితే, కచ్చితంగా ఎక్కడ పడతాయో ముందుగానే చెప్పడం సాధ్యం కాదని నాసా స్పష్టం చేసింది.

22 ఏళ్ల అద్భుత ప్రయాణం

2004 నవంబర్ 20న ప్రయోగించిన స్విఫ్ట్ అబ్జర్వేటరీని తొలుత రెండేళ్ల ప్రాథమిక సేవల కోసం రూపొందించారు. అయితే, అంచనాలకు మించి రెండు దశాబ్దాలకుపైగా పనిచేసింది. విశ్వంలో అత్యంత శక్తిమంతమైన పేలుళ్లుగా భావించే గామా కిరణాల విస్ఫోటనాలను గుర్తించి అధ్యయనం చేయడం దీని ప్రధాన లక్ష్యం. ఈ కాలంలో 2,000కు పైగా గామా కిరణాల విస్ఫోటనాలను పరిశీలించింది. సూపర్‌నోవాలు, బ్లాక్‌హోల్స్, ఇతర ఖగోళ వస్తువులపై పరిశోధనలకు విలువైన సమాచారాన్ని అందించింది.

కక్ష్య నుంచి కిందికి..

సూర్యుడిపై పెరిగిన కార్యకలాపాల ప్రభావంతో భూమి ఎగువ వాతావరణం విస్తరించింది. దీంతో తక్కువ భూ కక్ష్యలో పరిభ్రమిస్తున్న స్విఫ్ట్‌పై వాతావరణ ఘర్షణ పెరిగి, దాని వేగం తగ్గుతూ క్రమంగా కక్ష్య దిగువకు చేరింది. టెలిస్కోప్ కక్ష్యను పెంచి మరికొంతకాలం సేవలు అందించేలా చేసేందుకు నాసా ప్రయత్నించింది. ఇందుకోసం 'లింక్' అనే రోబోటిక్ అంతరిక్ష నౌకను పంపించింది. అయితే, ఆ నౌకలో తలెత్తిన నియంత్రణ సమస్యల కారణంగా టెలిస్కోప్‌ను పై కక్ష్యకు చేర్చే ప్రయత్నం విఫలమైంది. దీంతో స్విఫ్ట్ సేవలకు ముగింపు పలికి, భూమి వైపు దాని ప్రయాణాన్ని పర్యవేక్షిస్తున్నారు.

దక్షిణ భారత్ పరిధిలోకి శకలాల మార్గం

నాసా అంచనాల ప్రకారం.. స్విఫ్ట్ కక్ష్య వంపు కారణంగా దాని శకలాలు భూమధ్యరేఖకు ఉత్తర, దక్షిణ దిశల్లో 20.6 డిగ్రీల అక్షాంశాల మధ్య ఎక్కడైనా పడే అవకాశం ఉంది. ఈ విస్తృత పరిధిలో దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు కూడా ఉన్నాయి. అయితే, ఈ ప్రాంతం మొత్తం శకలాలు పడే మార్గమని అర్థం కాదు. టెలిస్కోప్ వాతావరణంలోకి ప్రవేశించే సమయం, ఆ సమయంలో దాని స్థానం ఆధారంగా శకలాలు పడే ప్రదేశం మారుతుంది. అందువల్ల నిర్దిష్ట ప్రాంతాన్ని ఇప్పుడే గుర్తించడం సాధ్యం కాదు.

ముప్పు చాలా తక్కువే!

టెలిస్కోప్ బరువు సుమారు 1.5 టన్నులు. వాతావరణంలోకి ప్రవేశించే సమయంలో అధిక భాగం కాలిపోతుందని, కొన్ని భాగాలు మాత్రమే భూమిని చేరే అవకాశం ఉందని నాసా అంచనా వేసింది. భూమిపై ఎవరికైనా హాని కలిగే ప్రమాదం సుమారు 2,100 మందిలో ఒకరికి మాత్రమే ఉంటుందని పేర్కొంది. శకలాలు సముద్రంలో లేదా జనావాసాలు లేని ప్రాంతాల్లో పడే అవకాశమే ఎక్కువగా ఉందని భావిస్తున్నారు. ఈ ప్రక్రియను నాసా, అమెరికా అంతరిక్ష దళం నిరంతరం పర్యవేక్షిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా అంచనాలను నవీకరిస్తున్నాయి.

రూ.600కే 1,000 కి.మీ. ఈవీ ప్రయాణం!

ముంబై: ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రతిపాదన చేశారు. రాత్రి వేళల్లో ఈవీ ఛార్జింగ్‌కు యూనిట్ విద్యుత్ ధరను రూ.3గా, పగటిపూట రూ.5గా నిర్ణయించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రికి సూచించినట్లు వెల్లడించారు. ఈ విధానం అమల్లోకి వస్తే 1,000 కిలోమీటర్ల ప్రయాణానికి ఎలక్ట్రిక్ కారుకు కేవలం రూ.600 మాత్రమే విద్యుత్ ఖర్చవుతుందని వివరించారు. ముంబైలో జరిగిన 'కేపీఎంజీ ఎన్‌రిచ్ 2026' కార్యక్రమంలో ఆయన ఈ ప్రతిపాదనను ప్రస్తావించారు.

టైమ్ ఆఫ్ డే టారిఫ్ విధానం

పగటిపూట సౌర విద్యుత్ లభ్యతను వినియోగించుకుంటూ, రాత్రి వేళల్లో తక్కువ ధరకు విద్యుత్ అందించడం ద్వారా ఈవీ ఛార్జింగ్‌ను ప్రోత్సహించవచ్చని గడ్కరీ అభిప్రాయపడ్డారు. విద్యుత్ వినియోగాన్ని సమతుల్యం చేయడంతో పాటు వాహనదారులకు నిర్వహణ ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు. రాత్రిపూట ఇళ్ల వద్ద లేదా ఛార్జింగ్ కేంద్రాల్లో వాహనాలను తక్కువ ధరకు ఛార్జ్ చేసుకునే అవకాశం కల్పిస్తే పెట్రోల్, డీజిల్ వాహనాల నుంచి ఈవీల వైపు ప్రజలు మొగ్గు చూపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఇది ప్రస్తుతం ప్రతిపాదన మాత్రమే. అమలు తేదీ, తుది విద్యుత్ టారిఫ్‌పై ఇంకా నిర్ణయం వెలువడలేదు. ఒక యూనిట్ విద్యుత్‌తో ఐదు కిలోమీటర్లు ప్రయాణించే సామర్థ్యం ఉన్న ఎలక్ట్రిక్ కారు 1,000 కిలోమీటర్లకు 200 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తుంది. రాత్రిపూట యూనిట్‌కు రూ.3 చొప్పున లెక్కిస్తే మొత్తం ఖర్చు రూ.600 అవుతుంది.

కంప్యూటర్ల పనితీరు పెంచేలా శాండిస్క్ నుంచి కొత్త నిల్వ పరికరాలు

విజయవాడ, మహానగర్



కంప్యూటర్ల పనితీరు, నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు శాండిస్క్ సంస్థ 520, 320 పేర్లతో రెండు కొత్త సాలిడ్ స్టేట్ డ్రైవ్ (ఎస్ఎస్డీ)లను అందుబాటులోకి తీసుకొచ్చింది. రెండున్నర అంగుళాల పరిమాణంలో రూపొందించిన వీటిని అనుకూలమైన పాత కంప్యూటర్లలోనూ అమర్చి వేగాన్ని పెంచుకోవచ్చని సంస్థ వెల్లడించింది. సమాచార సాంకేతిక నిపుణులు, సృజనాత్మక రంగాల్లో పనిచేసేవారు, అధిక పనితీరు కోరుకునే వినియోగదారుల కోసం రూపొందించిన 520 ఎస్ఎస్డీలో గరిష్ఠంగా 4 టీబీ నిల్వ సామర్థ్యం లభిస్తుంది. ఈ నమూనా గరిష్ఠంగా సెకనుకు 560 మెగాబైట్ల వేగంతో సమాచారాన్ని చదవడంతో పాటు, 525 మెగాబైట్ల వేగంతో రాయగలదు. సంస్థ ప్రత్యేక త్రీడీ నాండ్ సాంకేతికతతో రూపొందించిన ఈ పరికరం 4 టీబీ నమూనాలో 1,000 టీబీడబ్ల్యూ రైటింగ్ సామర్థ్యం, 22.5 లక్షల గంటల ఎంటీటీఎఫ్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీనిపై ఐదేళ్ల పరిమిత హామీ లభిస్తుంది. దీని ప్రారంభ ధర రూ.8,600. రోజువారీ కంప్యూటర్ వినియోగం కోసం రూపొందించిన 320 ఎస్ఎస్డీ 250 జీబీ నుంచి 2 టీబీ వరకు నిల్వ సామర్థ్యాలతో అందుబాటులో ఉంది. బ్రౌజింగ్, అనువర్తనాల వినియోగం, మల్టీమీడియా పనులకు సెకనుకు గరిష్ఠంగా 545 మెగాబైట్ల వేగాన్ని అందిస్తుంది. పాత హార్డ్‌డిస్క్ నుంచి కొత్త నిల్వ పరికరానికి సమాచారాన్ని బదిలీ చేసుకునే సదుపాయం కూడా ఉంది. దీనిపై మూడేళ్ల పరిమిత హామీ లభిస్తుంది. దీని ప్రారంభ ధర రూ.5,700గా సంస్థ ప్రకటించింది.

స్వచ్ఛ పరిశ్రమల పెట్టుబడి అవకాశాల్లో భారత్‌కు ప్రపంచంలో రెండో స్థానం

61 ప్రాజెక్టుల్లో 434 బిలియన్ డాలర్ల పెట్టుబడి అవకాశాలు

ప్రకటించిన ప్రాజెక్టుల ద్వారా 428 బిలియన్ డాలర్ల పెట్టుబడి అంచనా

చైనా తర్వాతి స్థానంలో భారత్.. ఆస్ట్రేలియా, బ్రెజిల్, అమెరికా కంటే ముందంజ

విజయవాడ, మహానగర్:

స్వచ్ఛ పరిశ్రమల పెట్టుబడి అవకాశాల్లో భారత్ ప్రపంచవ్యాప్తంగా రెండో స్థానంలో, ప్రాజెక్టుల సంఖ్యలో మూడో స్థానంలో నిలిచింది. మిషన్ పాజిబుల్ పార్టనర్‌షిప్, ఇండస్ట్రియల్ ట్రాన్సిషన్ యాక్సిలరేటర్ (ఐటీఏ) విడుదల చేసిన గ్లోబల్ ప్రాజెక్ట్ ట్రాకర్ ప్రకారం, దేశంలో 61 వాణిజ్య స్థాయి స్వచ్ఛ పరిశ్రమల ప్రాజెక్టులు మొత్తం 434 బిలియన్ డాలర్ల పెట్టుబడి అవకాశాన్ని కలిగి ఉన్నాయి. వీటిలో 428 బిలియన్ డాలర్లు ప్రకటించిన ప్రాజెక్టుల ద్వారా వచ్చే అవకాశం ఉండగా, 6.6 బిలియన్ డాలర్ల పెట్టుబడికి తుది నిర్ణయాలు పూర్తయ్యాయి. గ్రీన్ అమ్మోనియా, స్వచ్ఛ మిథనాల్, సుస్థిర విమాన ఇంధనం, తక్కువ కార్బన్ అల్యూమినియం రంగాల్లో ఈ ప్రాజెక్టులు విస్తరించి ఉన్నాయి. మొత్తం 61 ప్రాజెక్టుల్లో 59 ప్రకటన దశలో ఉండగా, రెండు తుది పెట్టుబడి నిర్ణయం (ఎఫ్ఐడీ) దశకు చేరుకున్నాయి. ప్రకటించిన ప్రాజెక్టుల్లో 319 బిలియన్ డాలర్లు పునరుత్పాదక ఇంధన సామర్థ్యానికి, 109 బిలియన్ డాలర్లు పారిశ్రామిక ఆస్తుల ఏర్పాటుకు సంబంధించినవి. గ్రీన్ అమ్మోనియా రంగంలో 45 ప్రాజెక్టులు ఉండగా, మిథనాల్‌లో ఎనిమిది, సుస్థిర విమాన ఇంధనంలో ఆరు, తక్కువ కార్బన్ అల్యూమినియంలో రెండు ప్రాజెక్టులు ఉన్నాయి. ఎఫ్ఐడీ పూర్తయిన రెండు ప్రాజెక్టుల్లో ఒకటి గ్రీన్ అమ్మోనియా, మరొకటి సుస్థిర విమాన ఇంధన రంగానికి చెందినవి. మిషన్ పాజిబుల్ పార్టనర్‌షిప్, ఐటీఏ ఇండియా లీడ్ యశ్ కశ్యప్ మాట్లాడుతూ, పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ సాధించిన పురోగతిని స్వచ్ఛ పారిశ్రామిక ప్లాంట్ల ఏర్పాటుకు వినియోగించుకోవాలని సూచించారు. ప్రకటించిన ప్రాజెక్టులను పెట్టుబడులకు సిద్ధమైన స్థాయికి తీసుకెళ్లేందుకు స్వచ్ఛ విద్యుత్, దేశీయ డిమాండ్, ఆర్థిక సహకారం కీలకమని పేర్కొన్నారు. ఈ అవకాశాలు కార్యరూపం దాలిస్తే పెట్టుబడులతో పాటు ఉపాధి, పారిశ్రామిక స్థిరత్వం పెరుగుతాయని వివరించారు.

ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలించిన జిల్లా కలెక్టర్



నాగాయలంక, మహానగర్

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు--2026లో భాగంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. బుధవారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రేపు మండల కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించే బృందాలకు అవసరమైన ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఈ ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. నాగాయలంక మండలంలో 45 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సిబ్బంది ఎన్నికల సామగ్రిని స్వీకరించి, వాటిని సరిచూసుకుంటున్నారని తెలిపారు. సామగ్రి పరిశీలన అనంతరం సిబ్బందిని సాయంత్రంలోగా తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలించేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. నాగాయలంక మండల పరిధిలోని కొన్ని గ్రామాలు లంక ప్రాంతాల్లో ఉన్నందున, అక్కడి పోలింగ్ సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని పడవల ద్వారా తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు.

భారత గోల్ఫ్ పటంలో వైజాగ్‌కు ప్రత్యేక గుర్తింపు

విశాఖపట్నం, మహానగర్

గోల్ఫ్ క్రీడా కేంద్రంగా విశాఖపట్నానికి గుర్తింపు తీసుకొచ్చే దిశగా ఏఎం గ్రీన్ ఐజీపీఎల్ లీగ్‌లో భాగంగా గ్రీన్ ఫ్యూయెల్స్ మారిటైమ్ ఇన్విటేషనల్--2026ను ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ (ఈపీజీసీ) నిర్వహిస్తోంది. ఈ క్లబ్‌లో ఐజీపీఎల్ టోర్నమెంట్ జరగడం ఇదే తొలిసారి. గ్రీన్ ఫ్యూయెల్ గ్లోబల్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యంలోని వైజాగ్ డాల్ఫిన్స్ గోల్ఫ్ క్లబ్, ఆంధ్రప్రదేశ్‌లో గోల్ఫ్‌ను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని తొలి అడుగుగా భావిస్తోంది. యువ క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించి, వారికి శిక్షణ అందించి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని గ్రీన్ ఫ్యూయెల్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్, జట్టు సహ యజమాని సుధాకర్ కలిగిత్తి తెలిపారు. ఈపీజీసీతో కలిసి శిక్షణ శిబిరాలు, జూనియర్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. క్లబ్ గౌరవ కార్యదర్శి ఎస్వీఆర్ రాజు మాట్లాడుతూ, ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌కు ఆతిథ్యమివ్వడం సంతోషంగా ఉందన్నారు. 1884 నుంచి కొనసాగుతున్న ఈ క్లబ్‌లో 2020లో ఛాంపియన్‌షిప్ స్థాయి గోల్ఫ్ కోర్సును పునరుద్ధరించామని క్లబ్ ఉపాధ్యక్షుడు టీఎస్ వర్మ తెలిపారు. వైజాగ్‌లో అద్భుతమైన గోల్ఫ్ కోర్సు ఉందనే విషయాన్ని ఈ టోర్నమెంట్ మరింత విస్తృతంగా పరిచయం చేస్తుందని పేర్కొన్నారు. టోర్నమెంట్ అనంతరం నిపుణులతో శిక్షణ శిబిరాలు నిర్వహించి,



ఐజీపీఎల్ సహకారంతో జూనియర్ గోల్ఫ్ అకాడమీ ప్రారంభించనున్నట్లు వైజాగ్ డాల్ఫిన్స్ డైరెక్టర్ సీహెచ్ రాజశేఖర్ వెల్లడించారు. మరోవైపు, యువతను, కొత్త ప్రేక్షకులను ఆకర్షించేందుకు ఐజీపీఎల్‌లో ఎక్స్-గోల్ఫ్ పేరుతో వేగవంతమైన పోటీ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు లీగ్ సీఈవో ఉత్తమ్ సింగ్ మండి తెలిపారు. ఇందులో ఒకే హోల్‌పై సమయంతో పోటీపడుతూ స్టేడియం తరహాలో ఆట సాగుతుందని వివరించారు.

ఈ నెల 20 నుంచి భవానీ దీక్ష ఉత్సవాలు

జనవరి 3 వరకు ఇంద్రకీలాద్రిపై ఉత్సవాలు

డిసెంబర్ 24న కలశ జ్యోతి నగరోత్సవం.. భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు

విజయవాడ, మహానగర్



ఇంద్రకీలాద్రిపై శ్రీ పరాభవ నామ సంవత్సర శ్రీ భవానీ దీక్ష ఉత్సవాలు ఈ నెల 20 నుంచి జనవరి 3 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ తెలిపారు. ఈ నెల 20న ఉదయం 8.45 గంటలకు మండల దీక్షాధారణ ప్రారంభమై, ఈ నెల 24న ముగుస్తుంది. డిసెంబర్ 10 నుంచి 14 వరకు అర్ధమండల దీక్షాధారణ నిర్వహిస్తారు. డిసెంబర్ 24న సాయంత్రం 6.30 గంటలకు సత్యనారాయణపురంలోని శ్రీ శివరామకృష్ణ క్షేత్రం (రామకోటి) నుంచి కలశ జ్యోతి నగరోత్సవం ప్రారంభమై అమ్మవారి ఆలయానికి చేరుకుంటుంది. డిసెంబర్ 30న ఉదయం 6.30 గంటలకు అగ్నిప్రతిష్ఠాపన, శత చండీయాగం, గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతాయి. జనవరి 3న ఉదయం 10 గంటలకు పూర్ణాహుతితో దీక్షల విరమణ ముగుస్తుంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, ప్రసాదం, కేశఖండన, స్నానఘట్టాలు తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో తెలిపారు. పూర్తి వివరాలకు 1800 425 9099 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బోర్‌వెల్ తవ్వకాల నిబంధనలు సవరించాలి

హైదరాబాద్, మహానగర్

భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో బోర్‌వెల్ తవ్వకాల నిబంధనలను క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా సవరించాలని రిగ్ ఓనర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ప్రస్తుతం అనుమతిస్తున్న గరిష్ఠ లోతు 120 మీటర్లుగా ఉండగా, దానిని 250 నుంచి 300 మీటర్లకు పెంచాలని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుత పరిమితి కారణంగా అనేక ప్రాంతాల్లో నీరు లభించడం లేదని, తాగునీరు, వ్యవసాయం, నిర్మాణ అవసరాల కోసం మరింత లోతులో బోర్లు తవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జీఓ 259కు అవసరమైన సవరణలు చేపట్టి రిగ్ యజమానులపై అదనపు ఫీజులు, జరిమానాలు విధించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులతో సంయుక్త కమిటీ ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించిన అనంతరం నిబంధనలు రూపొందించాలని సూచించారు. భూగర్భ జలాల పరిరక్షణకు సంబంధించి రికార్డుల నిర్వహణ, వర్షపు నీటి సేకరణ, రీఛార్జ్ గుంతల ఏర్పాటు వంటి కార్యక్రమాల్లో ప్రభుత్వానికి సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు మస్కు అంజిరెడ్డి, టి. వెంకటేష్, ప్రధాన కార్యదర్శులు జి. నర్సిరెడ్డి, ఒరుగంటి





లక్ష్మీనారాయణ జీఓ 259ను త్వరితగతిన సవరించి తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఈ నెల 10 నుంచి కార్తీక మాస ప్రత్యేక పూజలు

విజయవాడ, మహానగర్



కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానంతో పాటు శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో ఈ నెల 10 నుంచి డిసెంబర్ 8 వరకు నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ తెలిపారు. వైదిక కమిటీ సూచనల మేరకు నవంబర్ 9న ప్రదోష కాలంలో మల్లేశ్వర, నటరాజ స్వామివారి ఆలయాల్లో ఆకాశ దీపం ఏర్పాటు చేస్తారు. కార్తీక మాసమంతా ప్రతిరోజూ వివిధ వేళల్లో అభిషేకాలు, లక్ష్మీ గణపతి పంచాక్షరీ పఠనం, పారాయణాలు, ప్రత్యేక బిల్వార్చనలు, లక్ష బిల్వార్చనలు, సహస్ర లింగార్చనలు, ఊంజల్ సేవ నిర్వహిస్తారు. 13న నాగుల చవితి సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో తెల్లవారుజామున 4 గంటలకు అభిషేకం, సాయంత్రం 5 గంటలకు దీపోత్సవం జరుగుతాయి. 24న కార్తీక పౌర్ణమి సందర్భంగా సాయంత్రం 6.30 గంటలకు కోటి దీపోత్సవం, రాత్రి 7 గంటలకు జ్వాలాతోరణం నిర్వహిస్తారు. ఈ నెల 16, 20, 23, 24, 30 తేదీలతో పాటు డిసెంబర్ 4, 7 తేదీల్లో ప్రత్యేక బిల్వార్చన, అనంతరం అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. ఆర్జిత సేవల్లో సహస్ర లింగార్చన నెలవారీ టికెట్ రూ.5,116, ప్రత్యేక బిల్వార్చన రూ.2,000, నిత్య ఆర్జిత రుద్ర హోమం రూ.1,000, రోజువారీ సహస్ర లింగార్చన రూ.500, ఊంజల్ సేవ టికెట్ రూ.50గా నిర్ణయించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని ఈవో కోరారు.

క్రైస్తవుల హక్కులను పరిరక్షించాలి

దాడుల నివారణ, చర్చిల కూల్చివేతలను అడ్డుకోవాలని గవర్నర్‌కు యుసిపిఐసి వినతిపత్రం

పాస్టర్ల గౌరవ వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని విజ్ఞప్తి

చర్చిల మరమ్మతులకు రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని కోరిన ప్రతినిధులు

అమరావతి, మహానగర్:

రాష్ట్రంలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారి హక్కులు, భద్రతకు భరోసా కల్పించాలని యునైటెడ్ క్రిస్టియన్ ప్రొటెక్షన్ ఇండియా కౌన్సిల్ (యుసిపిఐసి) ప్రతినిధుల బృందం గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కోరింది. సంస్థ చైర్మన్ డాక్టర్ కోలా ప్రసాద్ నేతృత్వంలో ప్రతినిధులు గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. క్రైస్తవులు, పాస్టర్లు, మతపెద్దలపై దాడులు జరుగుతున్నాయన్న ఫిర్యాదులు, చర్చిలు, ప్రార్థనా మందిరాలపై దాడులు, కూల్చివేతలు,





తప్పుడు కేసుల ఆరోపణలు క్రైస్తవ సమాజంలో ఆందోళన కలిగిస్తున్నాయని కోలా ప్రసాద్ పేర్కొన్నారు. ఈ ఘటనలపై నిష్పక్షపాత విచారణ జరిపించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రార్థనా మందిరాలకు భద్రత కల్పించాలని కోరారు. నిరాధారమైన ఆరోపణలతో క్రైస్తవులపై కేసులు నమోదు కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. మరమ్మతులు అవసరమైన చర్చిలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కోదానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించాలని, ప్రతి గ్రామంలో క్రైస్తవ శ్మశానవాటికకు స్థలం కేటాయించి, ఇప్పటికే ఉన్న వాటిని ఆక్రమణల నుంచి రక్షించాలని కోరారు. పాస్టర్లకు ప్రస్తుతం అందిస్తున్న నెలవారీ రూ.5 వేల గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచడంతో పాటు క్రమం తప్పకుండా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ, సమానత్వం, భద్రత హక్కులను పరిరక్షించేలా సంబంధిత శాఖల ద్వారా చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. క్రైస్తవ సమాజానికి న్యాయం జరిగే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా తమ పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓగ్గు గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

వరుసగా ఐదో రోజూ లాభాల పంట.. కారణాలివే..



భారతీయ స్టాక్ మార్కెట్లు మరోసారి తమ పట్టును నిరూపించుకున్నాయి. గ్లోబల్ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు, అమెరికా మధ్యంతర ఎన్నికల ప్రభావం వంటి సవాళ్లు ఎదురైనప్పటికీ దేశీయ ఈక్విటీ మార్కెట్ సూచీలు బుధవారం అదరగొట్టాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సూచీలు వరుసగా ఐదో రోజు కూడా లాభాల బాటను వీడకుండా స్థిరమైన వృద్ధిని నమోదు చేశాయి. ఈరోజు మార్కెట్ సెషన్ ప్రారంభంలో కొంత తడబాటు కనిపించినా మదుపర్ల కొనుగోళ్ల మద్దతుతో మార్కెట్లు కోలుకుని లాభాలతో ముగిశాయి. నేటి ట్రేడింగ్ ముగిసే సమయానికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 383.55 పాయింట్లు బలపడి 77,301.40 పాయింట్ల వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 149.75 పాయింట్లు ఎగబాకి కీలకమైన 23,960.60 మార్కును తాకింది.

లాభాల వెనుక కొన్ని ముఖ్యమైన కారణాలు

కొంతకాలంగా అమ్మకాలకే పరిమితమైన విదేశీ సంస్థాగత మదుపర్లు ఇటీవల కాలంలో భారత మార్కెట్ల వైపు మళ్లీ దృష్టి సారించారు. బలమైన కార్పొరేట్ ఎర్నింగ్ అంచనాలు, లార్జ్-క్యాప్ షేర్లలో కనిపిస్తున్న ఆకర్షణీయమైన వాల్యుయేషన్ల కారణంగా ఎఫ్ఐఐల నుంచి మద్దతు లభిస్తోంది. నేటి సెషన్‌లో ఎఫ్ఎంసీజీ, రియల్టీ, మెటల్, మీడియా రంగాలు మంచి ప్రదర్శన కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.55%, స్మాల్‌క్యాప్ 100 సూచీ సుమారు 2 శాతం మేర లాభపడటంతో మార్కెట్లో పాజిటివ్ సెంట్రిమెంట్ బలపడింది. ప్రస్తుతం విడుదలవుతున్న2 ఆర్థిక ఫలితాలు అంచనాలకు తగ్గట్టుగా ఉండటంతో కంపెనీల షేర్లపై కొనుగోళ్ల ఒత్తిడి నెలకొంది. కీలక రంగాల కంపెనీల ఆదాయ వృద్ధి రేటు ఆశాజనకంగా ఉండటం మదుపర్లలో విశ్వాసాన్ని నింపింది. మొత్తం మార్కెట్ లాభాల్లో ముగిసినప్పటికీ గ్లోబల్ టెక్నాలజీ రంగానికి సంబంధించిన అనిశ్చితుల వల్ల నిఫ్టీ ఐటీ విభాగం మాత్రం 1 శాతానికి పైగా నష్టపోయింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. ప్రముఖ ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల సరళి, అంతర్జాతీయంగా ముడి చమురు ధరల తీరుతెన్నులను మదుపర్లు నిశితంగా గమనిస్తున్నారు. అయినప్పటికీ, దేశీయంగా బలమైన ఆర్థిక మూలాలు ఉండటం వల్ల నిఫ్టీ త్వరలోనే 24,000 మైలురాయిని అధిగమించే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పసిడికి సుంకాల సెగ

దేశంలో భారీగా పెరిగిన బంగారం స్మగ్లింగ్!

ముంబై : దేశీయంగా గోల్డ్ డిమాండ్ ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికం (క్యూ3)లో ఏకంగా 29 శాతం క్షీణించింది. దిగుమతి సుంకాల భారం, పెరిగిన ధరలు, బంగారం కొనవద్దంటూ దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు నేపథ్యంలో 162.5 టన్నులకే పరిమితమైంది. ఈ క్రమంలో ఈ ఏడాది మొత్తంగా పసిడి కొనుగోళ్లు 6 ఏండ్ల కనిష్ఠాన్ని తాకుతూ 625-675 టన్నులుగానే ఉండొచ్చని మంగళవారం విడుదల చేసిన 'క్యూ3 2026 గోల్డ్ డిమాండ్ ట్రెండ్స్' నివేదికలో ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) అంచనా వేసింది. నిజానికి గత ఏడాది జూలై-సెప్టెంబర్‌లో బంగారం అమ్మకాలు 229.8 టన్నులుగా ఉన్నాయని గుర్తుచేసింది. కాగా, పెంచిన దిగుమతి సుంకాలతో దేశంలోకి గోల్డ్ స్మగ్లింగ్ భారీగా జరుగుతున్నదని ఈ సందర్భంగా డబ్ల్యూజీసీ చెప్పడం గమనార్హం. అలాగే పుత్తడి ధరలు పెరిగిన నేపథ్యంలో గోల్డ్ సేల్స్ తగ్గినా విలువపరంగా మాత్రం 3 శాతం పెరిగి రూ.2,41,900 కోట్లుగా ఉన్నది. నిరుడు దాదాపు 230 కోట్ల విక్రయాలు జరిగినా.. దాని వాల్యూ రూ.2,35,090 కోట్లుగానే ఉన్నది.

దేశీయంగా ఈ జూలై-సెప్టెంబర్‌లో 10 గ్రాముల బంగారం రేటు (జీఎస్టీ, దిగుమతి సుంకం లేకుండా) సగటున రూ.1,48,891 (ట్రాయ్ ఔన్స్ 4,262 డాలర్లు) పలికింది. గత ఏడాది ఇదే వ్యవధిలో రూ.1,02,287 (3,457 డాలర్లు)గానే ఉన్నది.

ఆభరణాలకు డిమాండ్ 20 శాతం పతనమై 99.9 టన్నులుగా ఉన్నది. నిరుడు 125 టన్నులు.

బంగారం కడ్డీలు, నాణేలకు ఆదరణ మునుపటితో చూస్తే 40 శాతం తగ్గింది. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 91.6 టన్నులుగా ఉంటే.. ఈ ఏడాది కేవలం 55 టన్నులుగానే ఉన్నది.



గోల్డ్ ఈటీఎఫ్‌ల మొత్తం డిమాండ్ కూడా 50 శాతం క్షీణించింది. 10.7 టన్నుల నుంచి 5.3 టన్నులకు దిగజారింది.

దేశీయంగా ఈ 3 నెలల్లో రీసైకిల్డ్ గోల్డ్ 19.2 టన్నులుగా నమోదైంది. నిరుడు 21.8 టన్నులు.

నికరంగా పుత్తడి దిగుమతులు ఈ జూలై-సెప్టెంబర్‌లో గతంతో పోల్చితే 46 శాతం తగ్గి 114.1 టన్నులుగా ఉన్నాయి. క్రిందటిసారి 211.9 టన్నులుగా ఉన్నది.

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ..

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ జూలై-సెప్టెంబర్ గోల్డ్ డిమాండ్ 1 శాతం తగ్గి 1,369 టన్నుల వద్ద స్థిరపడింది. అధిక, నిలకడలేని ధరలే కారణమని డబ్ల్యూజీసీ పేర్కొన్నది. నగల డిమాండ్ 17 శాతం దిగి అత్యంత కనిష్ఠంగా 313 టన్నులుగా ఉన్నది. కరోనా సమయంలోనూ 331 టన్నులకు డిమాండ్ కనిపించినట్టు తెలిపింది. చైనాలో 22 శాతం తగ్గగా, భారత్‌లో 19.5 శాతం పడిపోయినట్టు వివరించింది. అమెరికా, మిడిల్ ఈస్ట్, సౌదీ అరేబియా తదితర దేశాల్లోనూ డిమాండ్ తగ్గుముఖం పట్టడం వరల్డ్ గోల్డ్ మార్కెట్‌ను ప్రభావితం చేసినట్టు డబ్ల్యూజీసీ ఇండియా ప్రాంతీయ సీఈవో సచిన్ జైన్ పీటీఐకి తెలిపారు.

తగ్గిన బంగారం, వెండి ధరలు

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు మంగళవారం తగ్గాయి. ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి రేటు రూ.700 క్షీణించి రూ.1,41,800 వద్ద నిలిచింది. అలాగే కిలో వెండి విలువ రూ.2,000 పతనమై రూ.1,84,000గా ఉన్నది. ఇదిలావుంటే హైదరాబాద్‌లో 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం పసిడి ధర రూ.1,28,000 పలికింది. ఇక అంతర్జాతీయ మార్కెట్ విషయానికొస్తే.. ఔన్స్ గోల్డ్ రేటు 41.19 డాలర్లు దిగి 3,905.44 డాలర్లుగా ఉన్నది. సిల్వర్ 48.97 డాలర్లుగా ట్రేడైంది. కాగా, రాబోయే ధనత్రయోదశి, దీపావళి సందర్భంగా దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి కొనుగోళు ఊపందుకోవచ్చన్న ఆశాభావాన్ని జ్యుయెల్లర్స్ వ్యక్తం చేస్తున్నారు. దేశీయ గోల్డ్ మార్కెట్‌ను ఈ జూలై-సెప్టెంబర్ నిరాశపర్చినా.. చివర్లో బంగారం ధరలు తగ్గుముఖం పట్టడంతో అప్పటిదాకా తమ కొనుగోళ్లను వాయిదావేసిన చాలామంది తిరిగి ముందుకొచ్చారు. అలాగే దక్షిణ భారతంలో పెండ్లిళ్లు, పండుగల సీజన్ సేల్స్‌కు కలిసొచ్చింది. నగల వర్తకుల ఎక్సేంజీ ఆఫర్లూ కొనుగోలుదారుల్లో కొంత ఉత్సాహాన్నైతే నింపాయి. మొత్తానికి ఈ త్రైమాసికంలో అధికారికంగానైతే బులియన్ దిగుమతులు బాగా పడిపోయాయి. కానీ స్మగ్లింగ్ పెరిగిందన్న సంకేతాలైతే ఉన్నాయి. ఇక రీసైక్లింగ్ సైతం అంతంతమాత్రంగానే జరిగింది. అయితే ప్రస్తుత పండుగ సీజన్‌లో గోల్డ్ మార్కెట్ మళ్లీ కళకళలాడే అవకాశాలున్నాయి. తగ్గుతున్న ధరలు సైతం డిమాండ్‌ను పెంచవచ్చు. తేలికపాటి నగలకు ఆదరణ, ఎక్సేంజీ ఆఫర్ల హవా కనిపించవచ్చు.

బాల కార్మిక చట్టాల అమలుకు ప్రత్యేక సెల్

దేశంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, చట్టాల అమలు తీరుపై సుప్రీంకోర్టు కఠినమైన వైఖరిని ప్రదర్శించింది. బాల కార్మిక (నిషేధ, నియంత్రణ) సవరణ చట్టం నిబంధనలను మరింత పకడ్బందీగా అమలు చేయడానికి, దేశవ్యాప్తంగా పర్యవేక్షణను తీవ్రతరం చేయడానికి ఒక ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ ప్రత్యేక సెల్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇందుకు సంబంధించి కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ కార్యదర్శి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోర్టు స్పష్టం చేసింది. బాల కార్మిక చట్టాల అమలులో వివిధ శాఖల మధ్య సమన్వయం కొరవడటం వల్ల క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు రావడం లేదని కోర్టు తెలిపింది. దీన్ని నివారించేందుకే ఈ సెల్ ఏర్పాటు అత్యవసరమని అభిప్రాయపడింది.



చట్టం అమలులో లోపాలపై కోర్టు అసంతృప్తి

కాగితాలపై చట్టాలు పటిష్టంగా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో వాటి అమలు నామమాత్రంగానే సాగుతోందని సుప్రీంకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. పేదరికం, ఉపాధి అవకాశాల లేమి వంటి సామాజిక కారణాలను అడ్డుపెట్టుకుని చిన్నారుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తున్న ఉల్లంఘనలను సహించేది లేదని హెచ్చరించింది. పరిశ్రమలు, హోటళ్లు, ఇటుక బట్టీలు, గృహ కార్మికులుగా చిన్నారులను వినియోగిస్తున్న తీరుపై మరింత కఠిన నిఘా అవసరమని ధర్మాసనం నొక్కిచెప్పింది.

ప్రత్యేక సెల్ ప్రధాన విధులు దేశవ్యాప్తంగా బాల కార్మిక నిషేధ చట్టం అమలు తీరును ఎప్పటికప్పుడు సమీక్షించడం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, శిశు సంక్షేమ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం. రక్షించిన బాలలకు విద్య, వైద్యం, ఉపాధి కల్పన పథకాలను సక్రమంగా అందేలా చూసి వారిని భవిష్యత్తుకు ధీమా కల్పించడం. చట్టాల ఉల్లంఘన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకునేలా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం.

కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్

తొలి వన్డేలో కివీస్‌పై భారత్ ఘన విజయం





కివీస్‌తో తొలి వన్డేలో 5 వికెట్ల తేడాతో భారత్ గెలుపు

వర్షం కారణంగా లక్ష్యాన్ని 143 పరుగులకు కుదింపు

విరాట్ కోహ్లీ అద్భుతమైన 74 పరుగుల ఇన్నింగ్స్

భారత పేసర్లు అర్ష్‌దీప్, గుర్నూర్, కంబోజ్ అద్భుత ప్రదర్శన

185 పరుగులకే కుప్పకూలిన న్యూజిలాండ్ జట్టు

ఆక్లాండ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వర్షం పదేపదే అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (74) క్లాస్ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. అంతకుముందు టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. భారత యువ పేస్ త్రయం అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్, అన్షుల్ కంబోజ్ అద్భుతంగా రాణించారు. మేఘావృతమైన వాతావరణాన్ని సద్వినియోగం చేసుకుంటూ కివీస్ బ్యాటర్లను ఆరంభం నుంచే ఒత్తిడిలోకి నెట్టారు. అర్ష్‌దీప్ సింగ్ 4 వికెట్లతో చెలరేగగా, గుర్నూర్ 3, అన్షుల్ 2 వికెట్లు పడగొట్టారు. వీరి దెబ్బకు న్యూజిలాండ్ జట్టు 40.2 ఓవర్లలో 185 పరుగులకే కుప్పకూలింది. కివీస్ జట్టులో ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ (38), గ్లెన్ ఫిలిప్స్ (30) కాసేపు నిలదొక్కుకునే ప్రయత్నం చేశారు. అయితే చివర్లో బ్లెయిర్ టిక్నర్ కేవలం 23 బంతుల్లో 4 సిక్సర్లతో 34 పరుగులు చేసి అనూహ్యంగా మెరిశాడు. అయినప్పటికీ కివీస్ జట్టు 200 పరుగుల మార్కును కూడా దాటలేకపోయింది. లక్ష్య ఛేదనలో టీమిండియా ఆరంభంలోనే ఒక వికెట్ కోల్పోయినా, విరాట్ కోహ్లీ తన క్లాస్ ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. వన్డే ఫార్మాట్‌లో తన 80వ అర్ధశతకాన్ని నమోదు చేసిన కోహ్లీ, మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (37)తో కలిసి రెండో వికెట్‌కు 113 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. భారత ఛేదన సమయంలో వర్షం రెండుసార్లు అంతరాయం కలిగించడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి (డీఎల్ఎస్) ప్రకారం లక్ష్యాన్ని 32 ఓవర్లలో 143 పరుగులుగా సవరించారు.

ఈ భాగస్వామ్యంతో భారత్ విజయం దాదాపు ఖాయమైంది. అయితే, లక్ష్యానికి చేరువవుతున్న సమయంలో భారత్ వరుసగా వికెట్లు కోల్పోయి కాస్త తడబడింది. అయినప్పటికీ, చివరకు 22.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసి సునాయాసంగా విజయాన్ని అందుకుంది.

స్పోర్ట్స్

రోహిత్ భాయ్ చేసిన

ఆ రనౌటే మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్: గిల్

తొలి వన్డేలో న్యూజిలాండ్‌పై 5 వికెట్ల తేడాతో భారత్ విజయం


యువ బౌలర్లు అన్షుల్ కంబోజ్, గుర్నూర్ బ్రార్ అద్భుతంగా రాణించారని ప్రశంస

లక్ష్య ఛేదనలో విరాట్ కోహ్లీ బ్యాటింగ్ మా పనిని సులభం చేసిందన్న కెప్టెన్

స్థిరత్వంతో ఇదే ప్రదర్శన కొనసాగించడమే లక్ష్యమని స్పష్టం



న్యూజిలాండ్ తో వన్డే సిరీస్ ను భారత జట్టు విజయంతో ప్రారంభించింది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా జరిగిన తొలి వన్డేలో 5 వికెట్ల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం) కివీస్‌పై ఘన విజయం సాధించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, విజయం అనంతరం మాట్లాడుతూ జట్టు ప్రదర్శనపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశాడు. ముఖ్యంగా సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మ చేసిన ఒకే ఒక్క రనౌట్, మ్యాచ్ గతిని పూర్తిగా మార్చేసిందని ప్రశంసించాడు. మ్యాచ్ అనంతరం గిల్ మాట్లాడుతూ, "మా బౌలింగ్, ఫీల్డింగ్ ఈరోజు చాలా అద్భుతంగా ఉన్నాయి. ముఖ్యంగా రోహిత్ భాయ్ చేసిన రనౌట్ ఆటలో పరిస్థితిని మా వైపు తిప్పింది. అదే మ్యాచ్‌కు కీలక మలుపు అని నేను భావిస్తున్నాను. మిచెల్, ఫిలిప్స్ మధ్య భాగస్వామ్యం ప్రమాదకరంగా మారుతున్న దశలో ఆ వికెట్ పడటం మాకు ఎంతో కలిసొచ్చింది. వారు గతంలో భారత్‌లో కూడా అద్భుతంగా ఆడారు. వారిద్దరినీ విడదీయడం కీలకం అయింది. ఓవరాల్‌గా ఇది ఒక గొప్ప జట్టు ప్రదర్శన" అని వివరించాడు. యువ బౌలర్ల ప్రదర్శనపై గిల్ ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించాడు. "ఇక్కడి పరిస్థితులకు అన్షుల్ కంబోజ్ లాంటి బౌలర్ కరెక్ట్‌గా సరిపోతాడు. అతను ఎప్పుడూ చురుగ్గా ఉంటూ బంతిని సీమ్ చేయడానికి ప్రయత్నిస్తాడు. పాత బంతితోనూ అతను చాలా ప్రభావవంతంగా ఉంటాడు. మరోవైపు, వికెట్ నుంచి పెద్దగా సహకారం అందని సమయంలో గుర్నూర్ బ్రార్ తన పేస్, అదనపు బౌన్స్‌తో ప్రభావం చూపగలడు. ఇవాళ వారిద్దరూ బౌలింగ్ చేసిన తీరు చూడటానికి అద్భుతంగా అనిపించింది" అని అన్నాడు. వర్షం కారణంగా మ్యాచ్‌కు పలుమార్లు అంతరాయం కలగడం, లక్ష్యాన్ని కుదించడం వంటి అంశాలపై స్పందిస్తూ, "ఒక బ్యాటర్ క్రీజులో కుదురుకున్న తర్వాత వర్షం పడి ఆట ఆగితే తిరిగి ఏకాగ్రత సాధించడం అంత సులభం కాదు. వర్షం తర్వాత పిచ్ వేగం కొద్దిగా పెరిగింది, బంతి మరింత చురుగ్గా కదిలింది. లక్ష్యం కూడా తగ్గడంతో మేం మా సాధారణ ఆట ఆడేందుకే ప్రయత్నించాం. ఆ సమయంలో విరాట్ భాయ్ ఆడిన తీరు మా పనిని చాలా సులభతరం చేసింది" అని గిల్ పేర్కొన్నాడు. తదుపరి మ్యాచ్‌కు జట్టులో చేయాల్సిన మార్పులపై అడగ్గా, "ప్రత్యేకంగా మార్పులేమీ అవసరం లేదు. మాకు స్థిరత్వమే ముఖ్యం. ఇదే ప్రదర్శనను మళ్లీ మళ్లీ పునరావృతం చేయగలిగితే, మేం చాలా మంచి స్థితిలో ఉంటాం" అని ధీమా వ్యక్తం చేశాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌట్ అయింది. వర్షం కారణంగా భారత్ లక్ష్యాన్ని 32 ఓవర్లలో 143 పరుగులుగా నిర్దేశించగా, జట్టు 22.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది.



కిరణ్ అబ్బవరం 'హతః' విడుదల వాయిదా.. కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడంటే?

టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం నిర్మాతగా వ్యవహరిస్తున్న రెండో చిత్రం 'హతః' విడుదల వాయిదా పడింది. అనుష్ గోరక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి అంచనాలున్నాయి. అయితే, బాక్సాఫీస్ వద్ద ఇతర సినిమాల పోటీ ఎక్కువగా ఉండటం, ప్రేక్షకులకు థియేటర్లలో సరికొత్త, అత్యుత్తమ సౌండ్ అండ్ విజువల్ అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ చిత్రంలో కుష్ణ మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవి, తనూజ పుట్టస్వామి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే సరికొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని చిత్ర బృందం స్పష్టం చేసింది.

అఫిషీయల్.. రజనీకాంత్ 'ధర్మన్'లో శ్రీలీల!

సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ధర్మన్'. యువ దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా లెజెండరీ నటుడు కమల్ హాసన్‌కు చెందిన 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' మరియు 'టర్మరిక్ మీడియా' బ్యానర్లు సంయుక్తంగా ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. కొద్దికాలంగా సోషల్ మీడియాలోనూ, సినీ వర్గాలలోనూ శ్రీలీల ఈ చిత్రంలో నటిస్తారనే వార్తలు జోరుగా ప్రచారంలో ఉన్నాయి. తాజాగా మేకర్స్ ఈ ఊహాగానాలన్నింటికీ తెరదించుతూ అధికారిక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియా వేదికగా ఓ ప్రత్యేక వీడియోను పంచుకుంటూ.. టాలెంటెడ్ నటి శ్రీలీల 'ధర్మన్' చిత్రంలో భాగం కాబోతున్నట్లు స్పష్టం చేశారు. ఈ చిత్రంలో రజనీకాంత్ ఇప్పటివరకు చూడని విభిన్నమైన పాత్రలో వైద్యుడిగా (డాక్టర్) కనిపించనున్నట్లు తెలుస్తోంది. కేవలం రజనీకాంత్ మాత్రమే కాకుండా, ఈ సినిమాలో ఎంపిక చేసిన తారాగణం కూడా చాలా ప్రత్యేకంగా ఉంది. రామ్ పోతినేని, గ్లామరస్ నటి సిమ్రాన్, రాశీఖన్నా, స్టార్ హీరోయిన్ నయనతార, కమెడియన్ యోగిబాబు తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇంతమంది స్టార్స్ ఒకే సినిమాలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి.



ఒకే శరీరంలో ఇద్దరు మనుషులు.. ఆసక్తికరంగా 'మాయ లేడీ' ట్రైలర్!

టాలీవుడ్‌లో వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్న రాకేష్ వర్రె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మాయ లేడీ' తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ తెలుగు ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఒకే శరీరంలో ఇద్దరు మనుషులు ఉంటే ఎలా ఉంటుంది అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుంది. ఫుల్ టైం కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమా ట్రైలర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. రాకేష్ వర్రె మరియు మధుమితల నటన, విజువల్స్ మరియు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. నవంబర్ 13న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్ ఇష్టపడేవారికి మంచి విజువల్ ట్రీట్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.





మిక్స్‌డ్ టాక్‌ను తట్టుకుని నిలబడిన 'రణబాలి'.. బాక్సాఫీస్ వద్ద రూ.82 కోట్ల గ్రాస్ కలెక్షన్లు!



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో భారీ అంచనాల మధ్య విడుదలైన 'రణబాలి' చిత్రం బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. సినిమా విడుదలైన ప్రారంభంలో కొన్ని మిక్స్‌డ్ టాక్ మరియు భిన్న స్పందనలు వచ్చినప్పటికీ, వీకెండ్స్ మరియు వర్కింగ్ డేస్‌లోనూ సినిమా వసూళ్లు మాత్రం ఎక్కడా తగ్గకుండా నిలకడగా కొనసాగుతున్నాయి. చిత్రానికి ఉన్న క్రేజ్ మరియు బీ, సీ సెంటర్స్ లో లభిస్తున్న ఆదరణ కారణంగా కలెక్షన్లు స్థిరంగా వస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. తాజా ట్రేడ్ నివేదికల ప్రకారం, ఈ చిత్రం ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 82 కోట్ల వరకు గ్రాస్ వసూళ్లను సాధించినట్లు అంచనా వేస్తున్నారు. థియేట్రికల్ రన్‌తో పాటు ఈ సినిమా నాన్-థియేట్రికల్ బిజినెస్ కూడా భారీ స్థాయిలోనే జరిగినట్లు తెలుస్తోంది. శాటిలైట్, డిజిటల్ (ఓటీ) మరియు ఆడియో రైట్స్ రూపంలో నాన్-థియేట్రికల్ బిజినెస్ ద్వారా సుమారు రూ. 85 కోట్లు రాబట్టినట్లు సమాచారం.

'మహంతి ఝాన్సీ రాణి అనే నేను'.. కింగ్100 టబు గ్లింప్స్

అక్కినేని నాగార్జున 100 వ చిత్రం 'కింగ్ 100'. ఈ సినిమా నుంచి ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ నటి టబు స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది చిత్రబృందం. టబు పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. 'మనుషుల్లో రెండు రకాలు.. కష్టాన్ని నమ్మేవాళ్లు, అదృష్టాన్ని నమ్మేవాళ్లు. 'మహంతి ఝాన్సీ రాణి అనే నేను'.. అంటూ ఆమె చెప్పే డైలాగ్ సినిమాపై అంచనాలు పెంచేస్తోంది. ఈ సినిమాకి దేవీశ్రీ ప్రసాద్ గట్టిగానే మ్యూజిక్ అందించినట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. రా. కార్తిక్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తున్న 'కింగ్ 100' డిసెంబర్ 24 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. నాగార్జున 100వ చిత్రం కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన తొలి గ్లింప్స్ కూడా ఆకట్టుకుంది.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999